ఘనంగా మొహర్రం వేడుకలు


నవతెలంగాణ-ఆలేరుటౌన్

పట్టణంలో వారం రోజుల నుండి మొహర్రం సందర్భంగా పీరీలు నిర్వాహకులు వాడవాడల డప్పు చప్పులతో తిరుగుతూ సవర్ల ఎత్తుకొని సందడి చేశారు. భక్తులు దట్టీలు కట్టారు. ఆలేరు పట్టణంలో శనివారం రాత్రి మొహర్రం పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

25వ రోజుకు చేరిన జీపీ సమ్మె

చౌటుప్పల్:గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ పట్టణకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న సమ్మె ఆదివారంతో 25వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులందరూ కలిసి 25వ నెంబర్ అంకెగా కూర్చొని నిరసన వ్యక్తంచేశారు. అనంతరం సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్.డి.పాషా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పట్ల కపట ప్రేమ చూపిస్తుందని విమర్శించారు. 25 రోజులుగా సమ్మె నిర్వహిస్తుంటే కార్మికులతో చర్చలు జరుపకపోవడం శోచనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఎర్రరాజు, ఉప్పు మారమ్మ, జయమ్మ, శివాజీ, రమేశ్, శంకర్, పెంటయ్య పాల్గొన్నారు.

ఆశల...సాగు



- డెడ్ స్టోరేజిలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు
- ఎగువన కురిసిన వర్షాలపైనే ఆధారం
- శ్రీశైలంకు చేరుతున్న వరద నీరు
- పక్షం రోజులో సాగర్‌కు ఇన్ ఫ్లో
- సాగునీరుపై అన్నదాతలు ఆశలు

నవతెలంగాణ-మిర్యాలగూడ

నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని రైతులు పంటలు సాగు చేసుకునేందుకు ఆశతో ఎదురుచూస్తున్నారు.ప్రస్తుతం నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజ్‌లో ఉంది.590 అడుగులకుగాను ప్రస్తుతం 515.10 అడుగుల నీటిమట్టం నిల్వ ఉంది. ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా వరదల రూపంలో ప్రతి ఏడాది నాగార్జున్‌సాగర్‌కు నీరు వస్తుంది.ఈ వర్షాకాలంలో ఎగువ ప్రాంతంలో ఆశించిన మెరుకు వర్షాలు కురవలేదు.కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో దిగువ ప్రాంతాల ప్రాజెక్టులకు ఇప్పుడిప్పుడే వరద నీరొచ్చి చేరుతుంది. జూరాల నుండి శ్రీశైలంకు వరద నీరు రాక పెరుగుతుండడంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు రైతులల్లో ఆశలు చిగురుస్తున్నాయి.ఈ వర్షాకాలంలో ఆలస్యంగా నైనా సాగునీరు అందుతుందని ధీమాలో అన్నదాతలు ఉన్నారు. కాగా ఇప్పటికే బోర్లు, బావుల కింద ఆయకట్టు పరిధిలో వరి నాటు ముమ్మరంగా సాగుతున్నాయి. సాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రాక ప్రారంభమైతే ఆయకట్టులో కాలువ కింద ఉన్న భూముల రైతులు వరినాట్లు వేస్తారు.గతంలో కంటే ఈ ఏడాది వర్షాకాలంలో కొంత ఆలస్యంగా నైనా ఆయకట్టులో పెద్దఎత్తున వరి నాట్లు వేసే అవకాశం కనిపిస్తుంది.

జోరుగా సాగు

సాగర్ ప్రాజెక్టు ఎడమకాలువ పరిధిలో ఈ వానకాలం సీజన్‌లో సాగు జోరందుకోనుంది.ఇప్పటికే బోర్లు, బావల కింద 30 శాతం వరినాట్లు వేశారు. దుక్కులు దున్ని నారు మడ్లు వేసి నాట్లు వేస్తున్నారు.చాలా ప్రాంతాలలో వ్యవసాయ కూలీలతో నాట్లు వేస్తున్నారు.కాల్వ పరిధిలో నాట్లు వేసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. నీటి విడుదలపై ప్రకటన వచ్చే అవకాశం ఉండడంతో పంటలు సాగు చేసుకునేందుకు రైతుల సిద్ధమవుతున్నారు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 6.5 లక్షల ఎకరాల్లో సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. ఒక్క నల్లగొండ జిల్లాలో సుమారు 3.80 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేసే అవకాశం ఉనట్లు అధికారులు తెలుపుతున్నారు.

సాగర్‌లో ప్రస్తుత నీటి నిల్వల వివరాలు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో నీటి నిల్వ డెడ్ స్టోరేజీలో ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 590 అడుగులు ఉండగా ప్రస్తుతం 515.20 అడుగుల నీటి నిల్వ ఉన్నది. అంటే 312.50 టీఎంసీలకుగాను 140.49 టీఎంసీ ఉన్నది. కుడికాలువకు 4,848 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.ఎడమ కాలువకు చుక్క నీరు కూడా ఇవ్వడం లేదు. విద్యుత్పత్తికి, క్రస్ట గెట్ ద్వారా నీరు విడుదల చేయడం లేదు. ఎస్ఎల్‌బీసీ (ఏఎంఆర్పీ)కు 1,350 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తంగా 6,198 క్యూసెక్కులు నీటిని విడుదల చేయగా ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో రూపంలో 6,198 క్యూసెక్కులు నీరు వస్తుంది. ప్రస్తుతం శ్రీశైలంకు సుమారు రెండు లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టు నీటి నిల్వ పెరుగుతుంది. శ్రీశైలం జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 808 అడుగులకు చేరుకుంది. మరో పక్షం రోజులు అయితే శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండుతుంది. ఆ తర్వాత నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు వస్తుంది. శ్రీశైలంకు ఇదే స్థాయిలో వరద నీరు వస్తే సాగర్ ప్రాజెక్టు నిండేందుకు మరో నెల రోజుల సమయం పడుతుంది.

ఆగస్టులోనే నీటి విడుదల

సాగర్ ఎడమకలువ పరిధిలోని ఆయకట్టుకు వర్షాకాలంలో నీటి విడుదల గతంలో సకాలంలో జరిగేది. ప్రతి ఏడాది వర్షాకాలంలో జులై చివరి వారంలో లేదా ఆగస్టు మొదటి వారంలో ఎడమ కాలవు నీటిని విడుదల చేసేవారు.ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా కురవలేదు. ఎగువ ప్రాంతంలో ఇప్పుడిప్పుడే వర్షాలు పడడంతో వరద నీరు ప్రాజెక్టులకు వస్తుంది. ఆలస్యంగా నైనా వరదలు రావడంతో శ్రీశైలం ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతుంది. రోజుకు రెండు లక్షల క్యూసెక్కుల చొప్పున నీరు వచ్చి చేరుతుంది. ఇదే ప్రవాహం కొనసాగితే 15 రోజుల్లో సాగరకు నీరు వచ్చే అవకాశం ఉంది. కాగా గత మూడు సంవత్సరాల నుంచి వర్షాకాలంలో నీటి విడుదలను పరిశీలిస్తే ఈ వర్షాకాలంలో నెల రోజుల పాటు ఆలస్యమయ్యే అవకాశం ఉన్నది. 2019లో ఆగస్టు 24న, 2020లో ఆగస్టు 12న, 2021 లో ఆగస్టు 8న, 2022లో ఆగస్టు 2న ఎడమ కాల్వకు సాగునీటి విడుదల చేశారు. ఈ వర్షాకాలంలో ఆగస్టు చివరిలో నీరు విడుదల అయ్యే అవకాశం కనిపిస్తుంది.

నీళ్ల వస్తాయి... సాగు చేస్తాం...

కప్పాల శ్రీను తడకమల్ల



నాకు తడక మల్ల మేజర్ కాల్వ కింద మూడు ఎకరాల వ్యవసాయ పొలం ఉంది.సాగునీటి పైన ఆధారపడి పంటలను సాగు చేసుకుంటున్నా.ఈ వర్షాకాలం సీజన్లోనూ సాగునీరు వస్తుందని ఆశిస్తున్నాం. కొంత ఆలస్యమైన సాగునీళ్ల వస్తాయని భావిస్తున్నాం. ఈ సీజన్‌లో ఎట్టి పరిస్థితిలో వరి సాగు చేస్తాం సాగు నీరు విడుదల చేస్తారనే నమ్మకం ఉంది.

పక్షం రోజులు పడుతుంది

ఎన్ఎస్పీ ఎస్ఈ నాగేశ్వర్‌రావు

శ్రీశైలం ప్రాజెక్టుకు ఇప్పుడిప్పుడే వరదపు నీరు వస్తుంది.శ్రీశైలంకు ఇన్‌ఫ్లో పెరుగుతుంది. మరో 10, 15 రోజుల్లో శ్రీశైలం ప్రాజెక్టు నిండే అవకాశం ఉంది.ఆ తర్వాత నాగార్జునసాగర్‌కు నీరు వస్తుంది. సాగర్ ప్రాజెక్టు నీరు వస్తే సాగు నీటి విడుదలపై ఆలోచన చేయొచ్చు. శ్రీశైలం నుండి వచ్చే వరద నీరు బట్టి నీటి విడుదల జరుగుతుంది.

రాంరెడ్డి ఆశయాలను నెరవేర్చాలి

- విగ్రహావిష్కరణలో జూలకంటి

నవతెలంగాణ-మిర్యాలగూడ



గట్టికొప్పుల రాంరెడ్డి ఆశయాలను కార్యకర్తలు నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. మండలంలోని తడక మల్ల గ్రామంలో గట్టికొప్పుల రాంరెడ్డి 4 వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహావిష్కరణ చేసి పూలమాలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంరెడ్డి ప్రజల కోసం అనేక పోరాటాలు చేశారని, 30 ఏండ్ల పాటు సర్పంచ్‌గా, సీపీఐ(ఎం) డివిజన్, రైతు సంఘం జిల్లా నాయకుడుగా పనిచేసి ఎన్నో సమస్యలు పరిష్కరించారని చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించాలన్నారు. పార్టీ నిర్మాణం కోసం ఎంతో కృషి చేశారని, గ్రామాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించారని ఆయన సేవలను కొనియాడారు.

ఆయన చిన్న వయసులోనే ఆనాడు సాగిన వీర తెలంగాణ సాయుధరైతంగా పోరాటం సందర్భంగా చిన్న పిల్లవాడిగా ఉంటూనే ఎంతో సాహసాలు చేసి దళాలకు పనిచేసిన చరిత్ర ఆయనకు ఉన్నదన్నారు. ఆనాటి నుండి చనిపోయే వరకు కూడా ఎత్తిన ఎర్రజెండా దించకుండా రైతు కూలీలు, పేదల కోసం, ఈ ప్రాంత అభివృద్ధి కోసం అనేక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకులు అంటే ఏదో వ్యాపారం కొరకు వచ్చేవాళ్ల తర్వాత ఏందంటే తమ స్వార్థ రాజకీయాల గురించి ఆలోచించలేదన్నారు. పదవులు ఉన్నా లేకపోయినా ఆయన సర్పంచ్‌గా అత్యధిక కాలం ఈ గ్రామానికి సర్పంచ్‌గా ఉండి కూడా సేవలు అందించరన్నారు. సమ సమాజం రావాలి అందరికీ తిండి, బట్ట, ఇల్లు, చదువు, వైద్యం, ఉపాధి, ఆరోగ్యం అందాలని కోరి అనేక ఉద్యమాలు చేశారని చెప్పారు. సమ సమాజ లక్ష్యంతో అది కమ్యూనిస్టు పార్టీ ఎర్రజెండా ద్వారానే సాధ్యమైతుందని నమ్మిన గొప్ప వ్యక్తి అన్నారు. నాయకుడిగా ఆదర్శంగా ఉన్నారని గుర్తు చేశారు. నాయకులను తయారు చేసే దాంట్లో రామిరెడ్డి కూడా ఒకరన్నారు.

నా వయసు మీద పడుతుంది. మీరంతా నాయకులుగా తయారు కావాలి ఇక్కడ ఉద్యమాన్ని పార్టీని, మీరే నడపాలని చెప్పేసి ఆ రకంగా ఎప్పటికప్పుడు మాకు తగిన సలహాలు ఇస్తూ ప్రోత్సహించే వారిని చెప్పారు. బాధాకరమైన విషయం ఏంటంటే మన నాయకుడుగా ఉన్న ఇంద్రారెడ్డి కూడా అకస్మాత్తుగా చనిపోవడం అన్నారు. ఆదర్శ నాయకులు లేని లోటును తీర్చే ప్రయత్నం చేయాలన్నారు. ఉద్యమాలలో యువకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అందరికీ న్యాయం జరగాలని కోరుకునే ఏకైక పార్టీ కమ్యూనిస్టు అన్నారు. మిగతా వాళ్లది అది కాదని, కొంతమందేబాగుపడాలని కోరుకుంటారని చెప్పారు. ఈ ప్రాంతంలో ప్రతి ఒక్క కార్యకర్త కూడా మనం వారసులాగా భావించి అమరుల ఆశయాలను సాధించడానికి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు నూకల జగదీష్ చంద్ర, వీరేపల్లి వేంకటేశ్వర్లు, ముడవత్ రవినాయక్, డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, సీతారాములు, మండల నాయకులు నగేష్, వెంకన్న, సైదమ్మ, సైదులు, సీనియర్ జర్నలిస్ట్ పుండరీచారి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆపరేషన్ ఆకర్ష్

- మంత్రి జగదీశ్‌రెడ్డి మార్క్ రాజకీయం
- ఇద్దరూ మాజీ మంత్రుల చేరిక అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు
- అయోమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు

నవతెలంగాణ-సూర్యాపేట



ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ కాంగ్రెస్ పార్టీ ని కలవర పెడుతోంది.ప్రధానంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒకరిద్దరూ అగ్ర నాయకులు బి.ఆర్.యస్ లో చేరనున్నట్లు షోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతోంది.ఉమ్మడి నల్లగొండ జిల్లా ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట. రాష్ట్ర కాంగ్రెస్ దిగ్గజాలన్నీ నల్లగొండ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నేతలే. కర్ణాటక ఎన్నికల ఫలితాలతో దూకుడు పెంచిన కాంగ్రెస్ ను.. బీఆర్ఎస్ చెక్ పెట్టాలని యోచిస్తుందా...అందుకే ఆపరేషన్ ఆకర్ష్ కు పదును పెట్టినట్లు తెలుస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాపై బీఆర్ఎస్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగానే వివిధ పార్టీల నేతలను పార్టీలో చేరికలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకు గాను విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి తనదైన శైలిలో వివిధ పార్టీలలో ఉన్న ముఖ్యమైన నాయకులు, కార్యకర్తలను తమ పార్టీలో చేర్చుకోవడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒకప్పటి కాంగ్రెస్ కంచుకోట అయిన నల్లగొండ జిల్లాను వరుస ఎన్నికల్లో జయ కేతనం ఎగురవేస్తూ మంత్రి జగదీశ్ రెడ్డి గులాబీ కొండగా మార్చారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాలు బీఆర్ఎస్ ఖాతాలోనే ఉన్నాయి. సాధ్యమైనంత వరకు వివిధ పార్టీలలో మంచి గుర్తింపు ఉన్న నాయకులు, కార్యకర్తలను ఇప్పటికే పార్టీలో చేర్చుకున్నారు. మిగిలిన నేతలు తమ పార్టీకి ప్రయోజన కరంగా ఉంటారని అనుకుంటే వెంటనే పావులు కదుపుతూ వారిని పార్టీలలో చేర్చుకుం టున్నారు.

కాంగ్రెస్ దూకుడుకు అడ్డుకట్ట....

ఈ నేపథ్యంలో కర్ణాటక ఎన్నికల ఫలితాలు, భట్టి విక్రమార్క పాదయాత్ర, పొంగులేటి ఖమ్మం సభతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ దూకుడు పెంచింది. ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు ఎంపీలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి లు.. వచ్చే ఎన్నికల్లో 12 స్థానాలకు 12 కాంగ్రెస్ గెలుచుకుంటుందని ప్రతిసారి సవాల్ విసురుతున్నారు. కాంగ్రెస్ దూకుడుకు అడ్డుకట్ట వేసే వ్యూహంలో భాగంగానే కాంగ్రెస్ యాదాద్రిభువనగిరి జిల్లా అధ్యక్షుడు కుంభం అనిల్ కుమార్‌రెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా అనిల్‌కుమార్‌రెడ్డి ఓటమి చవి చూసినప్పటికీ పార్టీని అంటి పెట్టుకున్నారు.అప్పటినుంచి అనిల్‌కుమార్‌రెడ్డిని పార్టీలో చేర్చుకునేందుకు మంత్రి జగదీశ్‌రెడ్డితో పాటు కొందరు ఎమ్మెల్యేలు ప్రయత్నం చేశారు.ఈ నేపథ్యంలో తాజాగా కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై విమర్శలు గుప్పించి సీఎం కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు.కాగా రాష్ట్ర కాంగ్రెస్ కు ప్రాతినిధ్యం వహిస్తున్న దిగ్గజనేతలంతా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వారే. దక్షిణ తెలంగాణలో ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ ముఖ్య నేతల దూకుడుకు అడ్డుకట్ట వేయడంలో భాగంగానే బీఆర్ఎస్ స్పెషల్ ఫోకస్ పెంచినట్లు తెలుస్తోంది.గత అసెంబ్లీ ఎన్నికల్లోనే కాంగ్రెస్ హేమాహేమీలైన జానారెడ్డి ,కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి వంటి నేతలను ఓడించి కాంగ్రెస్‌ను కంగు తినిపించింది.వచ్చే ఎన్నికల్లో 12 అసెంబ్లీ స్థానాలను తమ ఖాతాలో వేసుకునేందుకు బీఆర్ఎస్ ఇప్పటినుంచే పావులు కదుపుతోంది.వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్‌ను కనుమరుగు చేయాలనే లక్ష్యంతో గులాబీ అధినేత కేసీఆర్ ఉన్నట్టు సమాచారం.ఈ వ్యూహంలో భాగంగానే మరికొందరు కాంగ్రెస్ నేతలను గులాబీదళంలో కలుపుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ అగ్రనేతలు ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్టీని ఎన్నికల నాటికి నిర్వీర్యం చేయడం ద్వారా దక్షిణ తెలంగాణపై కాంగ్రెస్ ప్రభావానికి అడ్డుకట్ట వేయొచ్చని బీఆర్ఎస్ భావిస్తోంది.ఇందులో భాగంగానే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో పాటు భువనగిరి నియోజకవర్గంలోని ఎంపీపీలు, సర్పంచులకు గులాబీ కండువా కప్పింది.ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన మరికొందరు కాంగ్రెస్ నేతలను కూడా బీఆర్ఎస్‌లో చేర్చుకునేందుకు మంత్రి జగదీశ్‌రెడ్డి పావులు కదుపుతున్నారట.కుంభం దారిలోనే మరికొందరు కాంగ్రెస్ నేతలు పయనిస్తారని బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది.ఇప్పటికే కొందరు కాంగ్రెస్ దిగ్గజనేతలు గులాబీ కండువా కప్పుకుంటారని పలుమార్లు సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేశాయి.ఇందులో ప్రధానంగా నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి త్వరలో బీఆర్ఎస్‌లో చేరనున్నారంటూ సోషల్ మీడియా వేదికగా రూమర్స్ కొన్ని రోజులుగా హడావిడి చేశాయి.దీనిపై ఉత్తమ్ కుమార్‌రెడ్డి మౌనాన్ని వీడి తాను పార్టీ మారడం లేదని తేల్చి చెప్పారు.అయినప్పటికీ ఇంకా హుజూర్‌నగర్ ,కోదాడ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ నేతలలో గందరగోళం నెలకొంది. ఇదిలావుండగా మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కూడా బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు సోషల్ మీడియాతో పాటు ఒక ఛానల్‌లో ప్రసారం కావడం సంచలనం సృష్టించింది.కరడు గట్టిన కాంగ్రెస్‌వాదిగా పేరుగాంచిన దామోదర్‌రెడ్డి పార్టీ మారుతున్నట్టు వచ్చిన రూమర్స్‌ను కాంగ్రెస్ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు ఖండించారు.ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ పరిణామాలతో జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణులు అయోమయానికి గురవుతు న్నాయి.జరుగుతున్న రాజకీయ పరిణామాలను రూపుమాపడానికి గాను ఇప్పటికైనా తమ నేతలు నియోజకవర్గాల్లో ఉంటూ మనోధైర్యం కల్పించాలని కార్యకర్తలు కోరుతున్నారు. కాగా బీఆర్ఎస్ మాత్రం ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో నోటిఫికేషన్ వచ్చే సమయం వరకు చేరికల ప్రక్రియను పూర్తి చేసుకునేందుకు పావులు కదుపుతోంది.మున్ముందు రాజకీయ సమీకరణాలు ఎలా మారనున్నాయో వేచిచూడాల్సిందే.

సహకార బ్యాంకుల ద్వారా యూపీఐ సేవలు



- ప్రారంభించిన చైర్మెన్ గొంగడి మహేందర్‌రెడ్డి

నల్లగొండ కలెక్టరేట్ :జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల ద్వారా యూపీఐ సేవలు(ఫోన్ పే, గూగుల్ పే, పేటియం) ఆన్‌లైన్ ట్రాన్‌జెంక్షన్ కార్యక్రమాలు నేటి నుండి ప్రారంభిస్తున్నట్టు రాష్ట్ర టెస్కాబ్ వైస్ చైర్మెన్, ఎన్‌డీసీసీబీ చైర్మెన్ గొంగడి మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో యూపీఐ సేవల కార్యక్రమాలను పాలకవర్గం, వివిధ బ్రాంచి మేనేజర్లతో కలిసి లాంఛనంగా ఆయన ప్రారంభించి మాట్లాడారు. 31 బ్రాంచీలలో 2 లక్షల76 వేల ఖాతాదారులు ఉన్నారని, అందులో 1లక్ష60 వేల మంది ఖాతాలు కొనసాగుతున్నాయని తెలిపారు. బ్రాంచ్ మేనేజర్లు ఖాతాదారులకు యూపీఐ సేవలపై అవగాహన కల్పించి ఆన్‌లైన్ కార్యక్రమాలు ఉపయోగించే విధంగా వారికి దోహదపడాలన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలకు సేవింగ్ అకౌంట్స్, కరెంట్ అకౌంట్స్ ఖాతాలు తెరిచే విధంగా బ్యాంక్ సిబ్బంది అవగాహన కల్పించి నూతన ఎకౌంట్లు తీయాలని పేర్కొన్నారు. కమర్షియల్ బ్యాంకుల ధీటుగా సహకార బ్యాంకులు ఖాతాదారులకు సేవలందిస్తున్నారని తెలిపారు. ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో 9 వందల కోట్లతో ఉన్న బ్రాంచీలు నేడు పాలకవర్గం, సిబ్బంది కృషితో 2.3 వందల కోట్ల వరకు పురో అభివృద్ధి చెందాయని తెలిపారు. బ్యాంకు ఎన్‌పీఏ 2.03 ప్రకారం ముందుకు పోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం ఖాయం



- టీపీసీసీ ప్రధానకార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి

నవతెలంగాణ-చౌటుప్పల్

రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ప్రధానకార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి ధీమా వ్యక్తంచేశారు. ఆదివారం మండలపరిధిలోని పీపల్‌పహాడ్ గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన కార్యకర్తలు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు.పార్టీలో చేరిన వారికి కృష్ణారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మునుగోడులో కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణను చూడలేక కొంతమంది తనపై కుట్రతో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో చెరుకు మహేశ్, రాచకొండ శ్రీనుచారి, వరికుప్పల మహేశ్, మాదగోని గణేశ్, ఎర్ర నరేశ్, ముంత భాస్కర్, చిలివేరు రమేశ్ ఉన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు బత్తుల శ్రీహరి, సీహెచ్.నర్సింహ, చిదుగల్ల వెంకటేశం, రాజుయాదవ్, బోయపల్లిఅరుణ్, ఎర్ర నాగరాజు, గుండెబోయిన మహేశ్, చిలివేరు సాయి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సోయం బాబురావు ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి



నవతెలంగాణ-అదవిదేవులపల్లి

ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు సోయం బాబురావు ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుర్ర శివ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో రాజకీయ లబ్ధిపొందేందుకే లాంబాడీలను గిరిజన హోదా నుంచి తొలగించాలని వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. బీజేపి పార్టీ అండదండలతోనే ప్రశాంతంగా ఉన్న గిరిజనుల మధ్య ఘర్షణలకు తెరలేపారని పేర్కొన్నారు. సోయం బాబురావు సభ్యత్వాన్ని రద్దు చేయాలని, గిరిజన తెగల మధ్య ఘర్షణలను ఆపాలని, బీజేపీ చేస్తున్న కుట్రలను ప్రజలు వ్యతిరేకించాలని నినాదాలు చేశారు. ఈ సమావేశంలో హన్మంతు నాయక్,రాంబాబు, కోటినాయక్ ,పాచ్య నాయక్ ,రామాంజనేయులు, సేవ్య నాయక్,రవి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట యోధుడు లచ్చిరామ్ నాయక్

- నేడు సంతాపసభ

ఆయన పేదింటిలో పుట్టిన గిరిజన బిడ్డ... ఎర్రబాడ్ దొరలకు వ్యతిరేకంగా పోరు జెండా ఎత్తిన ధీరుడు.. సాయుధ రైతాంగ పోరాటంలో ఎనలేని పోరు సల్పిన ధీశాలి లచ్చిరామ్ నాయక్. దొరలేందిరా వీళ్లా పీకుడేందిరా అని భీమిరెడ్డి నర్సింహా రెడ్డి, స్వరాజ్యంల నాయకత్వంలో ఎర్ర జెండా పట్టి సాయుధుడై తుంగతుర్తి ప్రాంతంలో గిరిజన బిడ్డలకు అండగా నిలిచాడు. తన చివరి శ్వాస వరకు ఎర్రజెండా నీడనే నిలబడ్డారు..80 ఏండ్ల వయస్సులో ఈనెల 23న తుది శ్వాస విడిచారు.

దాడులకు వ్యతిరేకంగా నిలబడ్డ నాయక్

1983లో సీపీఎం నుండి భీమిరెడ్డి కుశలవ రెడ్డి పార్టీకి ద్రోహం చేసి పార్టీ బహిష్కరణకు గురై టీడీపీ లో చేరాడు. అప్పటి నుండి కుశలవరెడ్డి చేసే దాడులకు వ్యతిరేకంగా పార్టీ కార్యకర్తలకు ఎక్కడా కష్టం వచ్చినట్లు తెలిసినా కాలి నడకతో ఆ ప్రాంతానికి చేరుకునే వాడు. కార్యకర్తలకి ధైర్యం చెప్పేవారు. లచ్చిరామ్ నాయక్ బలం, ధైర్యం తెలుసుకొని తన వైపు రమ్మని కుశలవ రెడ్డి అనేక సార్లు బెదిరించినా భయపడని ధైర్యశాలి. కామ్రేడ్ బద్దం సోమిరెడ్డి, కామ్రేడ్ వర్దెల్లి పిచ్చయ్య లపై కుశలవ రెడ్డి గుండాలు దాడీ చేసికాళ్ళు చేతులు విరగొట్టి నప్పుడు ఇంకా దాడులు జరగకుండా కర్ర సాము సైన్యాన్ని తన వెంట తిప్పుకొని పార్టీ శ్రేణులకు అండగా నిలిచాడు.

గోరెంట్ల అభివద్ధికి కృషి

గోరెంట్ల అవాస గ్రామం చౌళ్లా తండా తన స్వగ్రామం. చౌళ్లా తండాకు వార్డు నెంబర్‌గా ఏకగ్రీవంగా గెలిసి రోడ్లు, మంచి నీళ్ల సదుపాయం, డ్రైనేజీలు, బడి కట్టించి తండా అభివద్ధికి బాటలు వేశాడు. భీమిరెడ్డి నర్సింహ రెడ్డి ఎంపీ నిధుల నుండి తండాలోని పేద గిరిజనులకు 40 ఇండ్లు కట్టించాడు.

ఎన్నికల స్టార్ కాంపెయినర్‌గా లచ్చిరామ్..

తుంగతుర్తి అసెంబ్లీ కి మిర్యాలగూడ పార్లమెంట్ కు జరిగిన ప్రతి జనరల్ ఎన్నికల్లో లచ్చిరామ్ నాయక్ తుంగతుర్తి ప్రాంతంలోని అన్ని తండాలోనూ గిరిజన భాషలో కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థుల గెలుపు కోసం విస్తతంగా ప్రచారం చేసేవాడు. 2005 లో జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో మూరగండ్ల లక్ష్మయ్య గెలుపు కోసం వయస్సును కూడా లెక్క చేయకుండా తండాలు తిరిగి కొత్తగా ఎదిగిన గిరిజన పిల్లలకు ఎర్రజెండా పోరాట చరిత్ర చెప్పేవాడు.

పార్టీ వైపు నిలబడ్డ నిబద్ధత గల నాయకుడు...

ఎంతో కాలం భీమిరెడ్డి కి ముఖ్య అనుచరుడిగా ఉన్నప్పటికీ పార్టీ చీలికను జీర్ణించుకోలేక పోయాడు. మీరు నిర్మించిన పార్టీకి మీరే దూరం కావద్దన్నాడు. పార్టీ చీలికను వ్యతిరేకించాడు. చాలా గ్రామాలు, ముఖ్య నాయకులు పార్టీకి దూరమైనా పార్టీ లైన్‌కు కట్టుబడి తన చివరి శ్వాస వరకు సీపీఎం వైపు నిలబడ్డాడు.



చెరుపల్లికి కర్రసాము నేర్పిన గురువు

1979లో చెరుపల్లి సీతారాములు స్వంత ఊరు నేరేడలో కాంగ్రెస్, భూస్వాముల, పెత్తందారుల ఆగడాలు రోజు రోజుకు పెచ్చుమీరుతున్నాయి. కార్యకర్తలు నిర్బంధాలు ఎదురుకుంటున్నారు. సీతారాములును టార్గెట్ చేశారు. భౌతిక దాడులకు శత్రువులు వెనుకాడని పరిస్థితి. తప్పని పరిస్థితిలో కర్రసాము నేర్చుకోవాలని, ఆత్మ రక్షణ చేసుకోవాలని పార్టీ గైడ్ చేసింది. వెంటనే నూతనకల్ మండలానికి చెందిన మన లచ్చిరామ్ గుర్తుకు వచ్చి లోకల్ పార్టీ ద్వారా నేరెడకు పిలిపించారు. నేరేడ, చిట్యాల లో వ్యవసాయ బావుల దగ్గర 20 రోజుల పాటు సీతారాములుతో సహా 30 మంది యువకులకు కర్ర సాములో శిక్షణ ఇచ్చారు. ఆ సందర్భంగా సీతారాములు అన్న దమ్ములు కూడా కర్ర సాము నేర్చుకొని బలమైన శత్రువులను వెంటబడి తరిమి తరిమి కొట్టారు. అప్పటి నుండి కాంగ్రెస్ గుండాల ఆగడాలు తగ్గాయి. చిట్యాల, నెరడ గ్రామాల్లో ప్రశాంత వచ్చింది. ఆ విధంగా కార్యకర్తలకు ఇచ్చిన ధైర్యం, ఆత్మ రక్షణ లో మెలుకవలు కార్యకర్తలకు ఉపయోగ పడ్డాయి.

జైలు జీవితానికి కూడా వెనకాడలే..

సంగెం ఘర్షణలు, భూపోరాటాలు, ఇండ్ల స్థలాల పోరాటం సందర్భంగా నూతనకల్ ఎంపీడీఓ కార్యాలయం ముట్టడిలో 8 మందిపై పెట్టిన కేసుల్లో కూడా లచ్చిరామ్ నాయక్ ముద్దాయిగా ఉండి జైలు జీవితాన్ని అనుభవించాడు. కామ్రేడ్ భీమిరెడ్డి ఎంపి గా ఉన్నా ,స్వరాజ్యం ఎమ్మెల్యే గా ఉన్న లేదా ఎవ్వరు ప్రజా ప్రతినిధులుగా ఉన్న తన స్వార్థం కోసం ఉపయోగించుకోలేదు. గ్రామాల అభివృద్ధికి పాటు పడ్డారు. తన జీవితాంతం నమ్మిన సిద్ధాంతం కొరకు నిలబడ్డ అరుదైన నాయకుడు మన లచ్చిరామ్ నాయక్. ఆయన త్యాగం, నిజాయితీ, పోరాట పటిమ, నిస్వార్థమైన జీవితం నేటి తరానికి ఆదర్శం. కామ్రేడ్ లచ్చిరామ్ నాయక్ కు విప్లవ జోహర్లు. సాధిద్దాం వారి ఆశయాలు.

– నెమ్మాది వెంకటేశ్వర్లు,
సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్‌గా వీరారెడ్డి

నవతెలంగాణ-భువనగిరిరూరల్

యాదాద్రి భువనగిరి జిల్లా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా జి.వీరారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు.కాగా ఇటీవలే దీపక్ తివారి బదిలీపై వెళ్లగా ఆ స్థానంలో వీరారెడ్డి వచ్చారు.



మణిపూర్ రాష్ట్రంలో శాంతి నెలకొల్పాలని వినతి

నవతెలంగాణ-చౌటుప్పల్

మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, హింస పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించి చర్యలు తీసుకొని శాంతియుత వాతావరణం నెలకొల్పాలని ఆదివారం మున్సిపల్ కేంద్రంలోని వలిగొండ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి చౌటుప్పల్, నారాయణపురం చర్చి పాస్టర్లు, సంఘవిశ్వాసులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు సాగర్, ఎలియా, శత్రజ్ఞ ఆచార్య, మోసెస్, సుజన్‌పాల్, యహాన్, విశ్వాసులు పాల్గొన్నారు.



చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

- రాష్ట్ర అధ్యక్షులు గంజి మురళీ

నవతెలంగాణ-చండూర్

చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంజి మురళి అన్నారు. ఆదివారం గట్టుప్పల మండల కేంద్రంలో చేనేత కార్మిక సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత కార్మికులకు 5 వేల కోట్లు కేటాయించాలన్నారు. ఇండ్లు, ఇండ్ల స్థలాల నిర్మాణం కోసం, కేంద్ర ప్రభుత్వం 10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలుఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం హ్యాండ్లూమ్ బోర్డ్ రద్దు చేయడంతో చేనేత కార్మికులకు అన్యాయం జరిగిందని తెలిపారు. చేనేత కార్మిక దినోత్సవం లోపు ప్రభుత్వమే నిల్వ ఉన్న చీరలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వ టెస్కో ద్వారా కొనుగోలు చేసి, చేనేత కార్మికులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చేనేత కార్మిక సంఘం మండల అధ్యక్షులు కర్నాటి వెంకటేశం, చేనేత కార్మిక సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు అంధెం రాములు, గౌర అధ్యక్షులు చెరుపెల్లి కృష్ణయ్య, కుకుడాల అశోక్, నామని స్వామి, సూరపల్లి మాణిక్యం, కర్నాటి యాదయ్య పున్న నరసింహ, గంజి జయరాములు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులకు జూలకంటి పరామర్శ



నవతెలంగాణ-వేములపల్లి

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చల్లబట్ల లక్ష్మారెడ్డి మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆదివారం సందర్శించి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) నాయకులు, ఎంపీటీసీ చల్లబట్ల ప్రణీత్‌రెడ్డి చైతన్య తండ్రి చల్లబొట్ల లక్ష్మారెడ్డి శనివారం రాత్రి ప్రమాదవశాత్తు మండల కేంద్రంలోని రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ సందర్భంగా ఆదివారం జూలకంటి లక్ష్మారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాప సానుభూతిని తెలిపారు. మండల కేంద్రంలో సర్వీస్ రోడ్డు లేకపోవడం వల్ల తరచుగా గ్రామానికి చెందిన ఎంతోమంది రోడ్డు ప్రమాదంలో బలవుతున్నారని, ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, వేములపల్లి వైస్ ఎంపీపీ పాదూరు గోవర్ధన, మండల కార్యదర్శి పాదూరు శశిధర్‌రెడ్డి, మాడ్గులపల్లి మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు శీలం బిక్షం మృతి

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు శీలం బిక్షంగౌడ్ (78) ఆదివారం మండలంలోని రావులపేట గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృత దేహాన్ని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిక్షం పార్టీకి ఎంతో కృషి చేశారని, ఆయన సేవలు మరవలేనివని కొనియాడారు. అనంతరం కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మంగారెడ్డి, రవినాయక్, చౌగాని సీతారాములు, పోలబోయిన వరలక్ష్మి ,శిలం సైదులు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ లక్ష్మీతో కొండంత భరోసా

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్

నవతెలంగాణ-దేవరకొండ

కల్యాణ లక్ష్మీ పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా అని దేవరకొండ శాసనసభ్యులు, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చందంపేట మండలానికి చెందిన 61మందికి రూ.61లక్షలు, నేరడుగొమ్ము మండలానికి చెందిన 35మందికి రూ.35లక్షలు కళ్యాణ లక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను, చీరలను ఎమ్మెల్యే లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నేనావత్ బుజ్జిలచ్చిరాం, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దొందేటి మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ముత్యాల సర్వయ్య, పీఏసీఎస్ చైర్మెన్ ముక్కమల్ల బాలయ్య, రైతు బంధు అధ్యక్షుడు బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ ఏర్పుల గోవింద్ యాదవ్, గోసుల అనంతగిరి, కేతవత్ లక్ష్మణ్‌నాయక్, పల్స వెంకటయ్య, జర్పుల లోక్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.





సాగర్ కుడి కాలువకు నీటి విడుదల నిలిపివేత

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి కాలువకు నీటి విడుదలను ఆదివారం ఎన్ఎస్పీ అధికారులు నిలుపుదల చేశారు. కుడికాలువ పరిధిలోని గ్రామాలకు త్రాగు అవసరాల నిమిత్తం గత 20వ తేదిన 10 రోజుల పాటు రోజుకు 5వేల క్యూసెక్కుల చొప్పున 4.2 టీఎంసీల నీటిని విడుదల చేశామని ఎన్ఎస్పీ ఏఈ కృష్ణయ్య తెలిపారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తిప్పర్తి మండల అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల జానయ్య, పాలడగు చంద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తిప్పర్తిలో జీపీ కార్మికుల సమ్మె 25 రోజులకు చేరింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికులు దున్నపోతుకు సమస్యలతో కూడిన వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసచారి, కాసాని సైదులు, దాసరి నరసింహ, చిట్టిపోలు బిక్షం, పీ.సైదులు, ఆర్జయ్య పీరయ్య, వెంకన్న, మర్తమ్మ, యాదయ్య, ఎంకమ్మ, ప్రమీల, బుజ్జమ్మ, వెంకటమ్మ, మరియమ్మ, అంజమ్మ, బుజ్జమ్మ, లింగయ్య, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి : నాంపల్లి మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం ముందు గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం కొనసాగింది. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మునుగోడు మాజీ శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమ్మె శిబిరంలో కూర్చుని కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు ఏరెడ్ల రఘుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు పూల వెంకటయ్య, కత్తి రవీందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకుల సంఘీభావం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు

నాంపల్లి మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల సమ్మెకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము బిక్షం, దామెర సర్పంచ్ యాదగిరి, పానుగంటి వెంకటయ్య, నాంపల్లి సంజీవ తదితరులు పాల్గొన్నారు.



గుండు గీయించుకుని జీపీ కార్మికుడు నిరసన

నార్కట్‌పల్లి : అర్హులైన గ్రామపంచాయతీ సిబ్బందిని సహాయ పంచాయతీ కార్యదర్శులుగా నియమిస్తూ కనీస వేతనం 19వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 25వ రోజు కొనసాగింది. సమ్మెలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమ్మె శిబిరంలో నార్కట్‌పల్లి గ్రామపంచాయతీ సిబ్బంది ఎండీ. షకీల్ గుండు గీయించుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా కన్వీనర్ కొండ వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.నరసింహ నార్కట్‌పల్లి మండల అధ్యక్షులు మంద ఎల్లయ్య, సీఐటీయూ నాయకులు ఎండీ. గౌసుద్దీన్, సారయ్య, శివ, శంకరప్ప, గోసుల వెంకటేశం, చిక్కుల రమేష్, దండు లింగయ్య, లింగాల నరసమ్మ, యాదమ్మ, మంద పరశురాం, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

నవతెలంగాణ-మిర్యాలగూడ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీసీ పట్ల అనుసరిస్తున్న నిర్ణయాల వల్ల ఆర్టీసీ మనుగడే ప్రమాదగా మారుతుందని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాల్లో ఆర్టీసీ కార్మికుల స్థితిగతులపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని లాభనష్టాలతో చూడకుండా ఆర్టీసీని బలోపేతం చేయాలన్నారు. రాష్ట్ర ఆవిర్భావంలో కూడా ఆర్టీసీ కార్మికుల పోరాటం ముఖ్య భూమిక పోషించిందని కేంద్రంలో ఉన్న ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం చేస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థల్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం బలోపేతం చేయాలన్నారు. కానీ నిర్వీర్యం చేయొద్దని సూచించారు. ఆర్టీసీ కార్మికుల పే స్కేల్ ఆర్టీసీ సంబంధించిన బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. ఆర్టీసీని అన్ని గ్రామాలకు వర్తింప చేయాలని, ఆర్టీసీలో ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించొద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు కేవీరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ఎండీ.సాహిద్, గిరిజన సమైక్య జిల్లా అధ్యక్షుడు లింగ నాయక్, ఎంసీపీఐ నాయకులు గోపి, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జావిద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులే వ్యవస్థల నిజమైన నిర్మాతలు

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

విద్యార్థులే వ్యవస్థల నిజమైన నిర్మాతలని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి ముఖ్యమంత్రి కేసీఆర్ సాగు, తాగు నీటితో పాటు విద్యా, వైద్యా రంగాల పటిష్టతకు పెద్దపీట వేశారని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. గాంధీ గ్లోబల్ ఫామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్, నల్లగొండ జిల్లా ట్రాస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా మహోత్సవం-2023 కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ, గురుకుల ప్రయివేట్ పాఠశాలలను తగిన రీతిలో ప్రోత్సహిస్తూ పేద విద్యార్థులు విద్యకు దూరం కాకుండా ఎన్నో వందల గురుకుల విద్యాసంస్థల నెలకొల్పుతూ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రథములుగా నిలిచి ఉత్తములుగా నిలిచిన విద్యార్థులను ప్రతిభా పురస్కారాలతో,విశిష్ట సేవలందించిన ప్రధానోపాధ్యులను గౌరవ పురస్కారంతో,అతిధులను,సంస్థల ప్రతినిధులను విశిష్ట పురస్కారాలతో సత్కరించారు. గాంధీ సంస్థల చైర్మెన్ డాక్టర్ మున్నా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవలో వ్యవస్థల నిర్మాణంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో తమ సంస్థలు ఎప్పుడు ముందుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీ సంస్థల ప్రతినిధులు డాక్టర్ యనాల ప్రభాకర్ రెడ్డి, గోనారెడ్డి, గంట్ల అనంతరెడ్డి, జీవీ. రావు, చెన్నయ్యగౌడ్, తిరుమల్‌రెడ్డి, గిరిధర్‌గౌడ్, రవీందర్ గౌడ్, అజీజ్ నాగమణి, జ్యోతి, వెంకటరెడ్డి, సంస్థల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



యువత ధైర్యంతో ముందుకు నడవాలి

- శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మెన్ విద్యాసాగర్

నవతెలంగాణ-నకిరేకల్

యువత ధైర్యంతో ముందుకు నడవాలని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మెన్ నేతి విద్యాసాగర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్వగృహంలో బీఆర్‌ఎస్ నాయకులు బచ్చుపల్లి గంగాధరరావు జన్మదినోత్సవ సన్నహాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ముందుకు రావడం అభినందనీయమన్నారు. బీజీఆర్ జన్మదినోత్సవ వేడుకల్లో యువత సేవా భావాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యకర్తలు ఎవరు అధైర్య పడద్దన్నారు. కొంతమంది అధికారం చేతిలో ఉందని ఓర్వలేక ప్రలోభాలకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎవరికీ భయపడనన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు బచ్చుపల్లి గంగాధర్‌రావు మాట్లాడుతూ ఎవరికి ఏ సహాయం కావాలన్నా అర్ధరాత్రి వచ్చి తలుపు తట్టిన తాను సాయం చేయడంలో ముందుంటానన్నారు. యువత ఎవరికి భయపడవద్దని, భయమే తమకు శత్రువుగా మారుతుందన్నారు. సేవ కార్యక్రమాలలో యువత ఆదర్శంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు సకినాల రవి, ఆరూరి వెంకటేశ్వర్లు, మాలే పవన్, పి మల్లారెడ్డి, దండి రఘు, బి జి ఆర్ సైన్యం ప్రతినిధులు పాల్గొన్నారు.



మధును పరామర్శించిన వీరేశం

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డుకు చెందిన నున్నం మధు చేతికి ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం మధును పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

రైతు కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-మిర్యాలగూడ

వేములపల్లి మండల కేంద్రానికి చెందిన చల్లబట్ల లక్ష్మారెడ్డి (58) సంవత్సరాలు శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆదివారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి వెళ్లి ఆయన మృతదేహాన్ని సందర్శించి సంతాపాన్ని తెలిపారు. అనంతరం లక్ష్మారెడ్డి కుమారుడు ప్రణీత్‌రెడ్డిని, కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి వెంట మండల పార్టీ అధ్యక్షులు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, సర్పంచ్ చిర్ర మల్లయ్యయాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ అమిరెడ్డి శేఖర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ మాలి శంకర్‌రెడ్డి, దుర్గారెడ్డి, టీడీపీ నాయకులు జడ రాములుయాదవ్, ఎల్లారెడ్డి, నాగవెళ్ళి శంకర్, ప్రభాకర్, రాచూరి శివ, పగిళ్ళ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ ఉన్నారు.



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని తాటికల్ శివారులో గల వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం చెట్లను నాటారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ, వృద్ధాశ్రమం చైర్మెన్ బొల్లం శోభా కృష్ణమూర్తి, జోన్ చైర్మెన్ రావిరాల అశోకు, ఉపాధ్యక్షుడు సూర్యచంద్రరావు, కోశాధికారి వరాకాంతం నారాయణరెడ్డి, పూర్వాధ్యక్షులు కోటగిరి రమేష్ దైద రవీందర్, ఆడెపు కృష్ణమూర్తి, బ్రహ్మదేవుర రమేష్, బెలిదే యాదయ్య, దేశగాని రాజశేఖర్, గోలి వేణుమాధవ్‌రెడ్డి పాల్గొన్నారు.

'రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి'

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

తాటి చెట్టుపై నుండి పడిన కల్లుగీత కార్మికునికి 10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కల్లుగీతకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్నగౌడ్ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలం చోల్లేడు గ్రామానికి చెందిన బేరి జలంధర్ ఆదివారం ఉదయం తాటి చెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడ్డారు. గాయాలుకావడంతో నల్లగొండ పట్టణంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జలంధర్‌ను వెంకన్నగౌడ్ పరామర్శించి అతనికి మంచి వైద్యం అందించాలని డాక్టర్‌ను కోరారు. ప్రభుత్వం నుండి పది లక్షల రూపాయలు నష్టపరిహారం తక్షణమే ఇచ్చి ఆ గీత కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలని, వారి జీవనోభృతి ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఉప్పల గోపాల్, మునుగోడు మండల అధ్యక్షులు అయితగోని మల్లేశంగౌడ్, బేరి జయమ్మ, హరి, అంజయ్య, నగేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



'గౌడ కుటుంబాల సంక్షేమానికి కృషి'

నవతెలంగాణ-చిట్యాలటౌన్

గౌడ కుటుంబాల సంక్షేమానికి కృషి చేస్తామని గౌడ సంఘం మండల అధ్యక్షుడు కూనూరు సంజయ్ దాస్ గౌడ్ తెలిపారు. చిట్యాల పట్టణంలోని కంఠమహేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో ఆదివారం చిట్యాల పట్టణ గౌడ సంక్షేమ సంఘం కార్యవర్గం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గౌడలు రాజకీయంగా,ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. చిట్యాలలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటుకు రూ.50వేల విరాళం ఇచ్చారు. దానితో పాటు దేవాలయ ప్రాంగణంలో రేకుల షెడ్డు నిర్మాణానికి రూ.లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. ధర్మ బిక్షం విగ్రహానికి మరగొని ఆంజనేయులు బ్రదర్స్, మారగొని శ్రావణ్ రూ.50వేల విరాళం ఇచ్చారు. ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.25 వేల విరాళం అందజేశారు. అనంతరం అడాహక్ కార్యవర్గన్ని సంజయ్ దాస్‌గౌడ్ ప్రకటించారు. సభ్యులుగా మారగొని ఆంజనేయులుగౌడ్, రెగులగడ్డ నర్సింహగౌడ్, పెద్దగొని మల్లయ్యగౌడ్, మేకల శివగౌడ్, పొన్నం లక్ష్మయ్యగౌడ్, పల్లె శ్రీదర్‌గౌడ్, కూనురూ అంజయ్యగౌడ్, కూనూరు బిక్షంగౌడ్, మేకల అంజన్ కుమార్‌గౌడ్, పబ్బతి సత్యనారాయణగౌడ్, మేకల సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.



జిల్లా ప్రజలకు సదా రుణపడి ఉంటా


గైనకాలజిస్ట్ డాక్టర్ గౌరిశ్రీ

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



ఎన్నో ఒడిదుడుకులు, కష్టనష్టాలను ఎదుర్కొని అత్యుత్తమ సేవలు అందిస్తూ నేడు సిల్వర్ జూబ్లీ వేడుకలు చేసుకుంటున్నామంటే దానికి జిల్లా ప్రజలే కారణమని జిల్లా ప్రజలకు సదా రుణపడి ఉంటానని కడిమి హాస్పిటల్ నిర్వాహకురాలు, గైనకాలజిస్ట్ డాక్టర్ గౌరీశ్రీ పేర్కొన్నారు. కడమి హాస్పటల్ స్థాపించి 25 సంవత్సరాలు అయిన సందర్భంగా ఆదివారం సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసాయి రక్ష మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ టీ. ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌరిశ్రీ మాట్లాడుతూ మొట్టమొదటిసారి హాస్పిటల్ ప్రారంభించిన రోజు ఈ స్థాయికి చేరుకుంటుందని అనుకోలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి లావణ్య, డాక్టర్ శశాంక్, హాస్పిటల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాదవ గర్జన సభను జయప్రదం చేయండి



నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

ఆగస్టు 8న హైదరాబాద్‌లోని ఇందిరపార్క్‌లో నిర్వహించే యాదవ గర్జనను విజయవంతం చేయాలని మాజీ జెడ్పీటీసీ జటంగి వెంకట నరసయ్యయాదవ్ అన్నారు. ఆదివారం మిర్యాలగూడలో యాదవ గర్జన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యాదవులను కేవలం ఓటు బ్యాంకు పరిగణిస్తున్నారని ఆయన ఆరోపించారు. వెంటనే ప్రభుత్వాలు యాదవులకు ఉన్న హక్కులను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుగుడు రవియాదవ్, ఎర్రయ్య, మురళియాదవ్, నాగేశ్వరరావు, చిమట శ్రీనివాస్, చింతలచెరువు లింగయ్య, శ్రీనివాస్, శ్రీను, ఉరిబండి శ్రీను, జానయ్య, కోటయ్య, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రయ్యకు నివాళులు



నవతెలంగాణ-నార్కట్‌పల్లి


మండల పరిధిలోని చిన్నతుమ్మలగూడెం గ్రామానికి ఉస్కుల చంద్రయ్య ఆదివారం అనారోగ్యంతో మరణించారు. ఈ సందర్భగా ఆయన మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి, ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ దాసరి రాజు తదితరులు ఉన్నారు.

శీత్లా పండుగ వేడుకలు

నవతెలంగాణ-మిర్యాలగూడ



మిర్యాలగూడ మండలం జంకు తండా గ్రామ పంచాయతీ మాలోతు తండాలో ఆదివారం సీతల పండగ ఘనంగా జరిగింది గ్రామ సర్పంచ్ మాలోతు రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాలోతు జబ్బర్ నాయక్, శంకర్ నాయక్, జామ్లు నాయక్, పాప నాయక్, బద్రు నాయక్, లక్పతి నాయక్, మంగా నాయక్, కేతవత్ శంకర్ నాయక్, మాలోతు పాండు నాయక్, రామారావు నాయక్, శ్రీరాములు నాయక్,దేవిలాల్ నాయక్ , శ్రీను నాయక్, కళ్యాణ్ నాయక్ అందరూ పాల్గొన్నారు.



మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

నవతెలంగాణ-చివ్వెంల



మణిపూర్ రాష్ట్ర క్షేమాభివృద్ధి కోసం మన్నా చర్చి పాస్టర్ సామ్యూల్ ఆధ్వర్యంలో ఆదివారం మండలకేంద్రంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ సామ్యూల్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న ఆకృత్యాలను నిలిపివేసి మహిళలకు రక్షణ కల్పించి రాష్ట్రంలో శాంతి నెలకొల్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, సంఘస్తులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కన్వీనర్‌గా బచ్చలకూర రాంబాబు ఎన్నిక

నవతెలంగాణ-సూర్యాపేట

తెలంగాణ జానపద వృత్తి కళాకారుల సంఘం జిల్లా నూతన కమిటీని ఆదివారం స్థానిక పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో ఎన్నుకున్నామి తిరుమల తిరుపతి శ్రీఅన్నమయ్య పీఠాధిపతి శ్రీ విజయ శంకర్ స్వామిజి, తెలంగాణ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండూరు భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ జానపద వృత్తి కళాకారుల సంఘం జిల్లా కన్వీనర్‌గా మునగాల మండలం నేలమర్రి గ్రామానికి చెందిన బచ్చల కూర రాంబాబును,జిల్లా కో కన్వీనర్‌గా జిల్లా కేంద్రానికి చెందిన ఎస్.దశరథలను ఎన్నుకున్నారు. వీరితో పాటు కమిటీ సభ్యులుగా మణికంఠ, డి.చిరంజీవి, లింగయ్య,సంధ్య,ప్రవీణ్, వి.వెంకన్న,నాగార్జున,చారి, రమేష్, బన్నీ,శంకర్ నాయక్, గోపి, నరసింహ లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నేటి సమాజానికి కావాల్సింది సంహారం కాదు.. సంస్కరణ

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట



ఉన్నత వ్యక్తిత్వ వికాసానికి శాఖాహారం ఎంతగానో దోహదం చేస్తుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక జమ్మిగడ్డలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్ మెంట్ సూర్యాపేట - పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో తలపెట్టిన మెగా శాఖాహార ర్యాలీలో ఆయన మాట్లాడారు. హింసా చోడో.. హంసా పకడో సిద్ధాంతంతో భారత దేశాన్ని అహింసాయుత దేశంగా మార్చడానికి బ్రహ్మర్షి పత్రిజీ నేతృత్వంలో పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ చేస్తున్న కృషి ఎనలేనిదని కొనియాడారు. నేటి సమాజానికి కావాల్సింది సంహారం కాదు సంస్కరణ అని పేర్కొన్నారు. శాఖాహారం తీసుకోండి.. ఎక్కువకాలం జీవించండని పిలుపునిచ్చారు. కూరగాయల్లో ఫైబర్, పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్, మినరల్స్ శరీరానికి కావాల్సిన మోతాదులో ఉంటాయన్నారు. వెజిటేరియన్ ఫుడ్ వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. మాంసాహారం తినేవాళ్లకంటే.. శాకాహారులు స్లిమ్‌గా వుంటారన్నారు. శాకాహారంలో కొవ్వు శాతం తక్కువగా ఉంటుందన్నారు. అందుకే శాకాహారానికి అలవాటు పడితే బరువు తగ్గుతారని తెలిపారు. కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం వల్ల.. రక్తప్రసరణ సరిగా జరిగి.. గుండె ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందన్నారు. కూరగాయల్లో ఐరన్, పోషకాలు సమృద్ధిగా ఉంటాయి కాబట్టి హృద్రోగాలకు దూరంగా ఉండొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్యయాదవ్, మున్సిపల్‌చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయశాఖ చైర్మెన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఇమ్మడి సోమనర్సయ్య, ఉప్పల ఆనంద్, జుట్టు కొండ సత్యనారాయణ, తోట శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



రాజు మృతి సీపీఐ(ఎం)కు తీరనిలోటు

నవతెలంగాణ-అర్వపల్లి

ప్రజానాట్యమండలి కళాకారుడు,సీపీఐ(ఎం) నాయకుడు పగిడిమర్రి రాజు మృతి సీపీఐ(ఎం)కు తీరనిలోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. జాజిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పగిడిమర్రి రాజు శనివారం ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించారు. ఆయన మృతదేహానికి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాజు 20 ఏండ్లు ప్రజానాట్యమండలిలో పనిచేస్తూ అనేక ప్రభుత్వ,ప్రయివేట్ కార్యక్రమాల్లో ప్రజలను చైతన్యం చేయడంలో అతని పాట ఎంతో దోహదపడిందన్నారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్, మండలకార్యదర్శి వజ్జె శ్రీను, కడియంకుమార్, విజయ్, బూర్గుల ప్రభాకర్,ఈదుల వీరపాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వేతనాలు పెంచాలి

నవతెలంగాణ-సూర్యాపేట

తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు పెంచాలని రాష్ట్ర క్యాబినెట్ తీర్మానం చేయాలనీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు10 సంవత్సరాల నుండి వేతనాలు పెంచక పోవడం దుర్భరమైన జీవితాలతో అలమటిస్తున్నారని పేర్కొన్నారు. శారీరక శ్రమతో పాటు మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. 2017, 2021 వేతన సవరణలు చేయక పోవడం చాలా దుర్మార్గమన్నారు. 2019 సమ్మె తర్వాత దాదాపు 10వేలకు పైగా కార్మికులు వివిధ రకాలుగా తగ్గిపోయారు కానీ సంస్థ ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు. తగ్గినా కార్మికుల భారం కూడా మోస్తూ సంస్థ అభివృద్ధికి పాటు పడుతున్నారన్నారు. యాజమాన్యం సీసీఎస్,పీఎఫ్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2019 సమ్మె అనంతరం ముఖ్యమంత్రి కార్మికులకు ఇచ్చిన హామీలు అమలుచేయాలని పేర్కొన్నారు. జరగబోయే క్యాబినెట్ మీటింగ్‌లో ఆర్టీసీ కార్మికుల వేతన సవరణ, ఉద్యోగ భద్రతపై సానుకూల నిర్ణయం చేయాలని కోరారు.

సాహిత్యం అభివృద్ధికి డాక్టర్ సినారే చేసిన సేవలు మరువలేనివి



నవతెలంగాణ-సూర్యాపేట

డా.సి.నా రె తెలుగు భాషకు యాస, ప్రాస నేర్పడంతో పాటు, సాహిత్యపు వెలుగులను తమ 'విశ్వంభర'రచనల ద్వారా విశ్వవ్యాప్త సుప్రసిద్ధ కవిగా ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. సి.నారాయణరెడ్డి 92వ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జ్ఞాన సరస్వతి సంగీత సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జిల్లా బాలభవన్‌లో నిర్వహించిన సంగీత విభావరిలో వారు మాట్లాడారు. డా.సి.నా.రె. సినీ గేయాల తో పాటు, గజల్స్, ఉర్దూ గీతికలు,రచనలు సాహిత్య లోకానికి తన వైవిధ్యలను, తెలుగు ప్రజలకు అందించారని కొనియాడారు. అదేవిధంగా రాజ్యసభ సభ్యునిగా, అధికార భాషా సంఘం అధ్యక్షుడు గా, విశ్వవిద్యాలయ కులపతిగా విశిష్ట సేవలందించారని వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గ్రహీత గుండా రమేష్,సత్యం, అబ్రహాం, ఎం.సంతసింగ్, ఎన్‌సీ.రోజా, దేవి, బి.సైదులు తదితరులు డా. సి.నా.రె. రచించిన సినీగీతాలను ఆలపించి శ్రోతలను అలరించారు. ఈ కార్యక్రములో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, డీసీఎంఎస్ ఉమ్మడి నల్గొండ జిల్లా చైర్మెన్ వట్టెజానయ్యయాదవ్, జెడ్పీ వైస్‌చైర్మెన్ గోపగాని వెంకటనారాయణ,డీఎస్పీ నాగభూషణం, మున్సిపల్ మాజీ చైర్మెన్ జుట్టుకొండ సత్యనారాయణ,బాలభవన్ సూపరింటెండెంట్ బి.రాధాకృష్ణారెడ్డి,బుద్ధి వెంకటేశ్వర్లు, చింతలపాటి చినశ్రీరాములు, దైద వెంకన్న, హమీద్‌ఖాన్, అనిత పాల్గొన్నారు.



మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

నవతెలంగాణ-గరిడేపల్లి

మణిపూర్ రాష్టంలో జరుగుతున్న ఘటనలు ఆగాలంటే వెంటనే ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయటమే ఒక్కటే మార్గమని సీపీఐ, సీపీఐ(ఎం) మండల కార్యదర్శులు షేక్ యాకుబ్, పోకల వెంకటేశ్వర్లు అన్నారు. మణిపూర్‌లో మైనార్టీలపై జరుగుతున్న ఘటనలను నిరసిస్తూ ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో గరిడేపల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్బయ్ ఆరు సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత కూడా మహిళలను వివస్త్రలను చేసి నగ్నంగా ఊరేగించడం అంటే దేశానికి ఇంతకంటే సిగ్గుచేటైనా విషయం మరొకటి లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు యడ్ల అంజిరెడ్డి, సీపీఐ(ఎం) మండల నాయకులు షైక్ హుసేన్, దొంతాగాని అంజయ్య, మాతంగి ముత్తయ్య, ములకలపల్లి వెంకటేశ్వర్లు, గోపి, నవీన్, సైదులు,పిట్టా వెంకటయ్య చారీ, తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

నవతెలంగాణ-తిరుమలగిరి



తిరుమల మండలకేంద్రం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానికంగా ఉన్న శుభమస్తు ఫంక్షన్‌హాల్‌లో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులు లయన్ టి.లక్ష్మినర్సింహారావు, లయన్ చంద్రశేఖర్ ఆర్య, శారద, లయన్ వెంకటేశ్వర్లు, కిరణ్, లయన్ విజయ్‌కుమార్, హాజరై నూతన కమిటీచే ప్రమాణ స్వీకారం చేయించారు. వీరిలో అధ్యక్షులు లయన్ మంద పద్మారెడ్డి, కార్యదర్శి లయన్ కందుకూరి లక్ష్మయ్య, కోశాధికారి లయన్ డాక్టర్ గాదరబోయిన సురేష్ యాదవ్‌ల శాలువాతో సన్మానించారు. అనంతరం సభనుద్దేసించి సూర్యాపేట జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లయన్ ఇమ్మడి సోమనర్సయ్య మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలు మరువలేనివన్నారు. నూతనంగా ఎన్నుకోబడ్డ లయన్స్ క్లబ్ కమిటీ సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలన్నారు. అనంతరం అంతకుముందున్న లయన్స్ క్లబ్ సభ్యులను జ్ఞాపికలతో, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్ నరోత్తంరెడ్డి, లయన్ కొమ్మినేని సతీష్, లయన్ కందుకూరు కృష్ణమాచారి,లయన్ డాక్టర్ జలగం రామచంద్రన్‌గౌడ్, లయన్ అయితే శ్రీనివాస్, లయన్ సారముల నర్సయ్య, లయన్ కాకి వెంకట్‌రెడ్డి, లయన్ ఇమ్మడి వెంకటేశ్వర్లు, లయన్ సోమేశ్, లయన్ డాక్టర్ రమేష్, లయన్ డాక్టర్ అనిల్ కుమార్, లయన్ గిరి గౌడ్, లయన్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.



వైకాసనుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-హుజూర్‌నగర్

సూర్యాపేట జిల్లా వైఖాసనుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత వైభవంగా ఆదివారం హుజూర్ నగర్‌లో నిర్వహించారు. ఈ సమ్మేళనంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రాఘవాచారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వైఖాసనులు సామాజికంగా ఆర్థికంగా ఎంతో ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ఆల్బమ్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహనకృష్ణ, బుర్ర వాసుదేవరావు మాట్లాడుతూ వైకాసానుల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి పునాది వేసిన నారగిరి రంగ భట్టాచార్యులను సమావేశంలో పాల్గొన్న వారందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో భాస్కరాచార్యులు మురళీకృష్ణమాచార్యులు, నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పగిడిమర్రి రాజుకు నివాళులు

నవతెలంగాణ-అర్వపల్లి

జాజిరెడ్డిగూడెం చెందిన కళాకారుడు పగిడిమర్రి రాజు అకాల మరణం చెందడంతో ఎంపీపీ మన్నె రేణుక లక్ష్మీయాదవ్, సూర్యాపేట జెడ్పీటీసీ జీడిభిక్షం, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య, బింగి వెంకన్న మేడిపల్లి వేణు మచ్చనర్సయ్య, వీరపాపయ్య, తిరుమలగిరి మాజీ ఎంపీపీ కొత్తగట్టు మల్లయ్య బూరుల ప్రభాకర్,కొండల్ నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ రూ.10 వేలు, జెడ్పీటీసీ రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు.



ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్

నవతెలంగాణ-మునగాల

రాష్టంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని డాక్టర్ అంజి యాదవ్ విమర్శించారు. ఆదివారం మన ఊరు-మన గడపకు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ప్ర చారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల హామీలు నెరవేర్చని ప్రభుత్వానికి రాబోయో ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. హామీలు నెరవేర్చని రాష్ట్ర ప్రభుత్వానికి రాబోయే ఎన్నిక ల్లో ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని తెలిపారు. అనంతరం గణపవరం, తిమ్మారెడ్డిగూడెం, కొక్కిరేణి, నారాయణగూడెం, కృష్ణనగర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త గంధం సైదులు, రాజశేఖర్ నాయుడు, తోట కమలాకర్, వెంకటేష్, బాబు, నవీన్, వెంకన్న, మాలోత్ బాలు, బండి గోపి, జగ్గ, బాణావత్ రాజా, పాల్గొన్నారు.

సంక్షేమపథకాల అమలులో తెలంగాణ ఆదర్శం



నవతెలంగాణ-కోదాడరూరల్

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణానికి చెందిన అర్వపల్లి అశోక్‌కు 1,50,000 రూపాయలు, చిలుకూరు మండల కేంద్రంనికి చెందిన నాగిరెడ్డి అంకిరెడ్డికి 2 లక్షల రూపాయల సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును బాధితులకు అందజేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంపటి మధుసూదన్, చిలుకూరు సొసైటీ చైర్మెన్ అల్సగాని జనార్దన్, నాయకులు రామారావు, సాంబయ్య, ఓరుగంటి గణేష్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో కనిపించని పల్లెవెలుగు బస్సులు

నవతెలంగాణ-చిలుకూరు

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ పల్లెల్లోకి పల్లె వెలుగు బస్సులు రావడంలేదని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నాగాటి చినరాములు అన్నారు. ఆదివారం మండలంలోని బేతవోలు గ్రామంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డప్పటికీ మండల వ్యాప్తంగా ఉన్న 17 గ్రామాలలో ఏ ఒక్క గ్రామానికి పల్లె వెలుగు బస్సులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు విద్యార్థులు, ప్రయాణికులు ప్రయాణం చేయాలంటే భారంగా ఉంటుందని తెలిపారు. గతంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. అన్ని గ్రామాల ప్రజలు ఆటోలో వెళ్లి రావాలంటే పలు రకాల అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అన్ని గ్రామాలకు పల్లె వెలుగు బస్సులను నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నారసాని వెంకటేశ్వర్లు, ఎగ్గడి లింగయ్య, పిల్లి వీరమల్లు, బత్తిని వెంకటయ్య, గట్టు లింగయ్య పాల్గొన్నారు.

పట్టుదలకు ప్రేమను జోడిస్తే ప్రతిపనితో అద్భుతాలు తథ్యం

- మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

పట్టుదలకు ప్రేమను జోడించి చేసే ప్రతి పనిలో అద్భుతాలు సాధించొచ్చని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పద్మశాలి భవన్‌లో పద్మశాలి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్,ప్రతిభాపురస్కార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కష్టపడకుండా ఏదీ రాదని ఒకవేళ వచ్చినా నిలబడదన్నారు. తోటి వారికి సహాయ పడడమనేది గొప్ప విషయమన్నారు. పద్మశాలి సేవా ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. త్వరలోనే పద్మశాలి భవన్‌కు స్థలాన్ని ఖారారుచేసి శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులంతా, పట్టుదలతో కష్టపడి చదివి తమ తల్లిదండ్రులకు ,సమాజానికి మంచి పేరు తేవాలని కోరారు. ఆటంకాలు వచ్చినా పట్టుదలతో చేసే పనిలో విజయం తధ్యమన్నారు. పట్టుదలతో మల్లేష్ తయారుచేసిన ఆసు యంత్రం ,తన తల్లి పడే కష్టంతో పాటు సమాజంలో ఎంతో మంది తల్లుల కష్టాలను తీర్చిందన్నారు. పట్టుదలతో చేసిన పని వల్లే మల్లేష్ కు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు. మల్లేష్ విజయం నేటి యువత కు స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభను చాటిన పద్మశాలి ప్రతిభావంతులు పద్మశ్రీ అవార్డ్ గ్రహీత డాక్టర్ చింతకింది మల్లేశం, సీపీఓ గూడా వెంకటేశ్వర్లు, స్నేహితుడు కృష్ణమోహన్ , న్యాయవాది కిరణ్ కుమార్ , సుదర్శన్‌లను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జెడ్పీవైస్‌చైర్మెన్ గోపగాని వెంకట్ నారాయణ,బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గండూరి ప్రకాష్, వైస్‌చైర్మెన్ పుట్టా కిషోర్, పెండెం చంద్రశేఖర్, వార్డు కౌన్సిలర్ గండూరి కృపాకర్ పావని, పెండెం వెంకటేశ్వర్లు, పెండెం పాండు, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-మోత్కూరు

స్థానిక ఎల్ఎస్‌గార్డెన్‌లో ఆదివారం మోత్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002-03 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 21 ఏండ్ల తర్వాత కలుసుకున్న ఆనాటి స్నేహితులంతా ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ కారణాలతో చనిపోయిన తోటి విద్యార్థులు ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. అనంతరం తమకు చదువు చెప్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.



ఆరోగ్యఉపకేంద్రం నిర్మాణపనులు ప్రారంభం

నవతెలంగాణ-మఠంపల్లి

మండలంలోని యాతవాకిళ్లలో నిర్మిస్తున్న ఆరోగ్య ఉపకేంద్రం పనులు ఆదివారం సర్పంచ్ కోలాహలం లక్ష్మీ నర్సింహారాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈ జితేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కోలాహలం కృష్ణంరాజు, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ మచ్చ వెంకటేశ్వర్లు, బీసీ సెల్ మండల అధ్యక్షులు ఎల్లావుల నాగయాదవ్, ఎస్సీ సెల్ విభాగం కుర్రి కాశయ్య, వార్డ్ నెంబర్ కొత్తూరు వెంకన్న, గొట్టం ప్రకాష్, బైరి శ్రీను, పులిలచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.60 వేల విలువైన బాడీ ఫ్రీజర్ బహూకరణ

నవతెలంగాణ-నేరేడుచర్ల

నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామంలో పుట్టి పెరిగిన కొంజేటి సత్యనారాయణ వృత్తిరీత్యా హైదరాబాదులో స్థిరపడ్డారు. కానీ ఊరిమీద ప్రేమతో వారి తల్లిదండ్రులైన కొంజేటి స్వరాజమ్మ, సీతారామయ్య జ్ఞాపకార్థంగా కల్లూరు గ్రామపంచాయతీకి 60 వేల రూపాయల విలువగల బాడీ ఫ్రీజర్‌ను ఆదివారం గ్రామపంచాయతీకి అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ మనం ఎక్కడ ఉండి ఎంత సంపాదించినా మన కన్న ఊరుకి ఎంతో కొంత సాయం చేయాలని అది ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లెపంగ నాగరాజు, కార్యదర్శి పద్మ, మాజీ వైస్ఎంపీపీ మాధవరావు, మాజీ సింగిల్ విండో చైర్మెన్ కర్నాకర్‌రావు, వార్డుసభ్యులు,గ్రామస్తులు మట్టయ్య, ప్రవీణ్, అక్కయ్య బాబు, ఎల్లయ్య, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.





ఆరాధ్య ఫౌండేషన్ మండల అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి

నవతెలంగాణ-నాగారం

ఆరాధ్య ఫౌండేషన్ మండల కమిటీ నిర్వాహణలో భాగంగా ఆదివారం నాగారం మండల కేంద్రంలో ఫౌండేషన్ చైర్మెన్ తాడోజ్ వాణి శ్రీకాంత్‌రాజ్ ఆధ్వర్యంలో మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షునిగా పాశం మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా నరేష్, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బుక్క శ్రీనివాస్, యువజన సంఘం మండల అధ్యక్షునిగా చిప్పలపల్లి భార్గవ్, ఉపాధ్యక్షుడిగా విజయ్, కిరణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పాశం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన తాడోజ్ వాణి శ్రీకాంత్రాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరాధ్య ఫౌండేషన్ సభ్యులు పోర్ల నాగరాజు, ప్రసన్న యశ్వంతు, ఏలేందర్, చాగంటి రాజు, కనకం సైదులు, వీరేశం తదితరులు పాల్గొన్నారు.



తమ ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని విజ్ఞప్తి

నవతెలంగాణ-సూర్యాపేట

తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని ఉమ్మడి నల్గొండ జిల్లాలోనిహోంగార్డులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మంత్రి జగదీశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగులకు సమానంగా సేవలు అందిస్తున్న పోలీస్ హోంగార్డులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో హామీ ఇచ్చిన నేపథ్యంలో టెక్నికల్ సమస్యలతో తమ సమస్య పరిష్కారం కాకుండా కాలయాపన జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్య పరిష్కారమైయ్యేలా చొరవ తీసుకోవాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో లింగానాయక్, మల్లారెడ్డి, యాదగిరి, రఘు తదితరులు పాల్గొన్నారు .

దేశానికి వన్నెతెచ్చిన గిరిజన సంస్కృతి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

నవతెలంగాణ-కోదాడరూరల్

గిరిజన సంస్కృతి దేశానికి వన్నెతెచ్చిందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మంగళ్ తండా గ్రామంలో గిరిజనుల ఆరాధ్యదైవం సీతలభవాని పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పాల్గొని మాట్లాడారు. అందరూ బాగుండాలని జరుపుకునే ఈ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వెంపటి మధుసూదన్, గ్రామ సర్పంచ్ రామావత్ పద్మ జబ్బార్, ఉప సర్పంచ్ వాసు, గ్రామ పాలకవర్గ సభ్యులు సావిత్రి, నాగ, లచ్చు, యువత అధ్యక్షులు సింహాద్రి, వీరయ్య, గ్రామ పెద్దకాపు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

భూదాన్‌పోచంపల్లి:మండల పరిధిలోని దేశ్‌ముఖ్, కప్రాయపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఆదివారం భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి,కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.కప్రాయపల్లి గ్రామానికి చెందిన 50 మంది యాదవ సంఘం నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షుడు రాఖీలు సత్యనారాయణ, సర్పంచ్ గోడల ప్రభాకర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు దేశ్‌ముఖ్ గ్రామానికి చెందిన 40 మంది యాదవ సంఘం సభ్యులు ఉపసర్పంచ్ దుర్గం మాధురి, కో ఆప్షన్ సభ్యులు శంకర్ యాదవ్, ముత్యాల మచ్చరెడ్డి,చిల్లర శంకర్‌యాదవ్ పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ వెంకటేశ్‌యాదవ్, మండల అధ్యక్షులు వాటి సుధాకర్‌రెడ్డి,రావుల శేఖర్‌రెడ్డి, బాలనర్సింహ, ముత్యాల మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

భువనగిరి రూరల్ :లారీ, బైక్ ను ఢీ కొట్టిన సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడిన సంఘటన మండల పరిధిలోని నందనం గ్రామ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల గ్రామానికి చెందిన బత్తుల క్రాంతికుమార్, పల్లె శివశంకర్‌తో భువనగిరికి శుభ కార్యం నిమిత్తం ఉదయం వచ్చి, శుభకార్యం పూర్తి కాగానే తిరిగి చిట్యాలకు వెళ్తుండగా మార్గమధ్యలో భువనగిరి నుంచి చిట్యాల వెళ్తున్న లారీ అజాగ్రత్తగా వాహనంనడిపి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను ఢీకొట్టాడు. కాగా బత్తుల క్రాంతికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు.మరొకరు పల్లె శివకుమార్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియాస్పత్రికి తరలించారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మోడీ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

మణిపూర్‌లో గిరిజనతెగపై జరుగుతున్న దాడులు,హత్యలు, లైంగికదాడులను నిరసిస్తూ ఆదివారం మండలాల్లోని పుట్టపాక గ్రామంలో సీపీఐ(ఎం) గ్రామ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాస్తారోకో చేసి నిరసన వ్యక్తం చేశారు.మణిపూర్ రాష్ట్రంలో గిరిజన తెగపై జరుగుతున్న దాడులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నక్కకృష్ణ,దొంతగోని పెద్దులు,పిట్టరాములు, పిట్ట గాలయ్య,నడికుడి నర్సింహ, కొంగరి మారయ్య, జోకు రామచంద్రం, గాజుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిక

నవతెలంగాణ-భువనగిరిరూరల్

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎల్లాంల జంగయ్యయాదవ్,నమాత్‌పల్లి సర్పంచ్ ఎల్లాంల శాలిని, నందనం ఎంపీటీసీ మట్ట పారిజాత శంకర్‌బాబుతో పాటు పలువురు హైదరాబాద్‌లోని కుంభం ఇంటి వద్ద బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు కోట పెద్దస్వామి, మండల కార్యదర్శి అనాజీపురం గ్రామ నాయకులు బొల్లెపల్లి ఆశోక్,వడాయిగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు ముద్దసాని ఉపేందర్, తుక్కాపురం గ్రామ ప్రధానకార్యదర్శి నల్లమాస రవిగౌడ్, చుక్కల సత్యనారాయణ, యూత్ అధ్యక్షులు శెట్టి ప్రశాంత్,గోడిసెల అమరేందర్,బోల్లేపల్లి జానకిరాంతో పాటు 40 మంది ఉన్నారు.



నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-తుర్కపల్లి

తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో అనారోగ్యంతో మరణించిన బరిగే బాలయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల శ్రీనివాస్ ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు బరిగే మహేందర్, గ్రామబూత్ అధ్యక్షులు తాటికొండ నర్సింహులు, నాయకులు కనకరాజు శ్రీకాంత్,ప్రకాష్, కొండయ్య, మహేందర్, వెంకటయ్యనర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన పలువురు కాంగ్రెస్ శ్రేణులు

నవతెలంగాణ-వలిగొండ రూరల్

మాజీ ఎంపీపీ తుమ్మల నర్సయ్య ఆదివారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు.మండలం అరూర్,నర్సాయిగూడెం,గురునాథ్ పల్లి,అప్పిరెడ్డిపల్లి,వలిగొండ, గంగపురం గ్రామాలకు చెందిన వారు కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు చేరుతున్నారని తెలిపారు.రాబోయే రోజుల్లో కాంగ్రెస్ నుండి బీఆర్‌ఎస్‌లో భారీ సంఖ్యలో చేరనున్నట్టు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్,బోళ్ల శ్రీనివాస్, కంకల కిష్టయ్య, పసల జ్యోతి విజయానంద్,బండారునర్సింహారెడ్డి, ఆవుల స్వామి, ఆవులసత్యనారాయణ,చంద్రయ్య, చమ్మయ్య,అంజయ్య, బాలరాజు,ఇన్నయ్య, ఇన్నెంట్,సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి కమిటీ సమావేశం

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు పట్టణంలో ఆదివారం శ్రీ గోదాదేవి, లక్ష్మీదేవి సహిత రంగనాయక ఆలయం అభివృద్ధి కమిటీ సమావేశం మోర్తాల గోపిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు సభ్యులు ఆలయ సమస్యల పరిష్కారం కోసం వాడీవేడిగా చర్చలు జరిపారు.ఆలయంలో కొత్తగదుల నిర్మాణపనులు, ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మంగళగిరి శేషగిరి, మంగళగిరి వరదరాజులు, సభ్యులు పాషికంటి శ్రీనివాస్, తోట మల్లయ్య,కే.సాగర్‌రెడ్డి, యెలుగల కుమారస్వామి, నందగంగేష్, సోమశెట్టిమహేందర్,బి.నాగయ్య, పాషకంటి కృష్ణ,సముద్రాల శ్రీధర్ పాల్గొన్నారు.

కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని కలిసిన గుర్రం నర్సింహులు

నవతెలంగాణ-భువనగిరి



ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ ఎస్‌లో చేరిన యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా హైదరాబాద్‌లో వారి నివాసంలో కలిసి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గుర్రం నర్సింహులు ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా భువనగిరి పార్లమెంట్ రాజకీయాలపై వారు గంటసేపు మాట్లాడుకున్నారు.

బీజేపీ పాలిత రాష్ట్రాలలో మహిళలకు రక్షణ కరువు



- ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ

నవతెలంగాణ-భువనగిరి

మణిపూర్ రాష్ట్రంలో జరిగిన మహిళల మీద దాడిని చూస్తుంటే దేశంలో మహిళలకు రక్షణ లేదని, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మణిపూర్ అల్లర్లపై నోరు విప్పి సమాధానం చెప్పాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, పీడబ్ల్యూఓ జిల్లా కార్యదర్శి ఆర్.సీతా, వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ణం పద్మ డిమాండ్ చేశారు.ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మణిపూర్ అల్లర్లపై స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు.సభ్య సమాజం తలదించుకునేలా మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరిగిన సంఘటన మణిపూర్ రాష్ట్రానికే కాకుండా భారతదేశంలో ఉన్న మహిళా సమాజం మొత్తం కించపరచబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కనీసం స్పందించలేదన్నారు.దేశ ప్రధాని కూడా మణిపూర్ ఘటనపై మౌనంగా ఉండడం దేనికి సంకేతమని ప్రశ్నించారు.బీజేపీ పాలిత రాష్ట్రాలలో అత్యధికంగా మహిళల మీద దాడులు, దౌర్జన్యాలు ,లైంగికదాడులు జరుగుతున్నాయని విమర్శించారు.మహిళలకు రక్షణ కల్పించలేని ప్రభుత్వాలు బీజేపీ పాలిత రాష్ట్రాలలో మనువాదాన్ని అమలు చేస్తూ ప్రజల హక్కుల మీద దాడులు చేయిస్తుందని విమర్శించారు.అన్ని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 4న జరిగే మణిపూర్ సంఘటనపై భారీ ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ డి.బాలనర్సయ్య, రైతుసంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, ఎన్‌పీఆర్డీ జిల్లాకన్వీనర్ కె.లలిత, సీపీఐ మహిళా సమైక్య అధ్యక్షురాలు ఎ.పుష్ప,జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షులు దయ్యాల నర్సింహ, వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎండి అత్తర్, సీనియర్ జర్నలిస్ట్ కొలుపుల వివేకానంద, సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్, జి.శ్రీనివాసచార్యులు, పురుషోత్తంరెడ్డి, మల్లారెడ్డి, రాంబాయి, బండారు రవివర్ధన్, గోవింద్, నాగమణి, అమీద్, గడ్డం వెంకటేష్, ముత్యాలు, మాధవి పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-తుర్కపల్లి

మండలంలో పలు గ్రామాలు మంచిరోల మామిళ్ళ,దయ్యంబండతండా,గోపాల్ పూర్,గోగులగుట్టతండా,పెద్దతండా గ్రామాల్లో ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడిన వారికి బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్య వారిని పరామర్శించడంతో ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ యాదగిరిగుట్టఅధ్యక్షులు గుడిపాటి మధుసూదన్‌రెడ్డి,ఆలేరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ ధనావత్ శంకర్‌నాయక్,జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షులు ధనావత్ భాస్కర్‌నాయక్, కాంగ్రెస్ మండలప్రధాన కార్యదర్శి,కోనాపూర్ ఉపసర్పంచ్ చాడ భాస్కర్‌రెడ్డి,యాదగిరిగుట్ట సీనియర్ నాయకులు భరత్‌గౌడ్,రుస్తాపూర్ ఎంపీటీసీ ధనావత్ మోహన్‌బాబునాయక్,మండల ఉప అధ్యక్షులు భూక్యా రాజారామ్‌నాయక్,బొత రాములు,సర్పంచులు బిచ్చునాయక్,బాబునాయక్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బాలుయాదవ్, ఎన్‌ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి నిఖిల్‌గౌడ్, ఎస్టీ సెల్ మండల ప్రధానకార్యదర్శి బానోత్ వినోద్ నాయక్,మండల నాయకులు సుదర్శన్, ధరావత్ సురేష్,గ్రామ శాఖ అధ్యక్షులు వల్లపు రమేష్,మహేందర్, నవీన్,నాయకులు విజయ్,తిరుపతి,వెంకటేష్ ,దేవేందర్,హుస్సేన్,నవీన్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.



జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆలేరురూరల్

జీపీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జేఏసీ మండల అధ్యక్షుడు గాదపాక రమేష్ డిమాండ్ చేశారు ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు జీపీ కార్మికుల సమ్మె 25వ రోజుకు చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమంలో బాబురెడ్డి, కొమరయ్య, జూకంటి రామచంద్రయ్య, యాకోబు, ఉప్పలయ్య, సుగుణమ్మ, మల్లమ్మ, దివ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



వలిగొండరూరల్ : మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీవో ఆఫీస్ ఎదుట గ్రామపంచాయతీ సిబ్బంది చేస్తున్న నిరవధిక సమ్మె 25వ రోజుకు చేరుకున్నది.మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ కమిటీ సభ్యులు వడ్డబోయిన వెంకటేశం, సూరారం మధు, మట్టిపల్లి వెంకటేశం, కేశ బోయిన శ్రీనివాస్, నరసింహ రాము ,శంకరయ్య కలుకూరి స్వామి, కందుల బిక్షపతి, కౌసల్య లలిత రేణుక పల్లెర్ల స్వామి ,లక్ష్మమ్మ, కంచి రామలింగం, కాసాని జగతయ్య తదితరులు పాల్గొన్నారు.



తుర్కపల్లి: తుర్కపల్లి మండలకేంద్రంలో జీపీ కార్మికులు సమ్మె నిర్వహించారు.సమ్మెకు తెలంగాణ రాష్ట్ర గొర్రెలు,మేకల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మెన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ సంఘీభావం తెలిపారు.జీపీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.వెంటనే సమస్యను ప్రభుత్వవిప్ గొంగిడిసునీత దృష్టికి తీసుకెళ్లాలన్నారు.ఈ కార్యక్రమంలో తుర్కపల్లి ఎంపీపీ భూక్యా సుశీల రవీందర్‌నాయక్, మండల పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ రాసాల ఐలేష్ యాదవ్, ప్రముఖ గాయకుడు ఎండి జహంగీర్, పాండు, గ్రామ పంచాయతీ సిబ్బంది యూనియన్ అధ్యక్షులు లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యక్షులు ఎరుకల స్వామిగౌడ్, కార్యదర్శి శ్రీశైలం,గుండెబోయిన బాలకృష్ణ గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జన్మదిన వేడుకల్లో పాల్గొన్న డీసీసీబీ చైర్మెన్

నవతెలంగాణ-ఆలేరురూరల్

బీఆర్‌ఎస్ పార్టీ యువజన నాయకులు సొంటెం ప్రవీణ్ కుమారుని జన్మదిన వేడుకలు మండలంలోని కొలనుపాక గ్రామంలో ఏపీఎన్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నల్గొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మెన్ గొంగిడి మహేందర్‌రెడ్డి హాజరై బాలున్ని ఆశీర్వదించారు.అనంతరం పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు అందజేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు గంగుల శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు జంగస్వామి, మాజీ ఎంపీటీసీ అంజయ్య ,నాయకులు దూసరి గణేష్,మామిడాలనర్సింహులు, బాశెట్టిరాజు, మిట్టపల్లి పాండు,అరె మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



నిందితులను కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-భువనగిరి

బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యులు రాయసం ఆదిశేషు విఠల్‌ను కిడ్నాప్ చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ భువనగిరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.ఈ సందర్భంగా ఐలూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండి ఇస్మాయిల్, జిల్లా అధ్యక్షులు మామిడి వెంకట్‌రెడ్డి మాట్లాడారు.న్యాయవాదులకు రక్షణ కరువైందన్నారు.రక్షణ చట్టం లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.న్యాయవాదులు తమ ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. దేశవ్యాప్తంగా న్యాయవాదులపై హత్యలు,దౌర్జన్యాలు జరుగుతున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ చట్టం తీసుకురావడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు.ఏపీలోని ప్రకాశం జిల్లా అద్దంకి సివిల్ కోర్టుకు పోయి వస్తుండగా దారి మధ్యలో ఆదిశేషువిఠల్‌ను కిడ్నాప్ చేసి హత్య చేసిన దుండగులను వెంటనే పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఐలూ జిల్లా ఉపాధ్యక్షులు కుక్కదూగు సోమయ్య, తడకమోహన్, పాల్వంచ జగత్, సహాయ కార్యదర్శులు, సీస శ్రీనివాస్, చింతలరాజశేఖర్‌రెడ్డి, బొల్లేపల్లి కుమార్, కోశాధికారి బొడ్డు కిషన్, పాల్గొన్నారు.

కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

నవతెలంగాణ-భువనగిరి

కాంగ్రెస్ కార్యకర్తలు జిల్లాలో జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకోకుండా సమిష్టిగా పనిచేసి కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలని వక్తలు విజ్ఞప్తి చేశారు.ఆదివారం స్థానిక ఎలిమినేటి మాధవరెడ్డి షాదీఖానలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్ అధ్యక్షతన పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భువనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు కలిసికట్టుగా పని చేయాలని కోరారు. భువనగిరి పట్టణంలో పార్టీ బలోపేతం, పట్టణ అధ్యక్షునిగా కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు.ఈ సమావేశంలో టీపీసీసీ డెలిగేట్ తంగళ్ళపల్లి రవికుమార్, పోతంశెట్టివెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు దొనకొండ రాములు, మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్. కుక్కదువు సోమయ్య,మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎండి.తాహేర్, సేవాదళ్ చైర్మెన్ పిట్టల బాలరాజు, మైనార్టీ పట్టణ అధ్యక్షులు సయ్యద్ రషీద్, ఎండి ఎజాజ్,భువనగిరి వెంకటరమణ, తాడూరి నర్సింహ,గుర్రం శ్రీనివాస్, హారున్ షరీఫ్, సయ్యద్ ముల్తానిషా. సీనియర్ కాంగ్రెస్ అభిమాని,అడ్వకేట్ నిసంగి విద్యాసాగర్, నాయకులు పోకల యాదగిరి పాల్గొన్నారు.





ధర్మారెడ్డిపల్లి కాలువపై కల్వర్టులు నిర్మించాలి

నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని సర్నేనిగూడెం గ్రామ పరిధిలోని రైతులు పంట పొలాల వద్దకు రాకపోకలు నిర్వహించడానికి ధర్మారెడ్డిపల్లి కాలువపై రెండు కల్వర్టు దారులను నిర్మించాలని ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకట్ స్వామి డిమాండ్ చేశారు.ధర్మారెడ్డిపల్లి కాలువను దాటడానికి ఇబ్బంది పడుతున్న రైతుల అవస్థలను ఆయన ఆదివారం రైతులతో కలిసి సర్నేనిగూడెం గ్రామం వద్ద పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు సౌకర్యవంతంగా కల్వర్టు నిర్మించాలని, లేనిపక్షంలో కలెక్టరేట్, నీటిపారుదల శాఖ కార్యాలయాల ముందు రైతులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వరికల్ గోపాల్ ,నాయకులు బొడ్డుపల్లి కాడయ్య, చిట్టిమళ్ళ శ్రవణకుమారయోధ, కట్టమహేందర్, ఉయ్యాల లింగస్వామిగౌడ్, నీలస్వామి ముదిరాజ్, కావలి ఈదయ్య, కావలిగోపాల్, గంగాదేవి నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.



పూర్ణగిరి ఆలయంలో చోరీ

- హుండీలు పగలగొట్టి, రూ.15000 నగదు అపహరణ

నవతెలంగాణ-భువనగిరిరూరల్

భువనగిరి మండలంలోని నమాతపల్లి గ్రామంలో గల శ్రీ పూర్ణగిరి సుదర్శన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ఆలయ ప్రధానద్వారాన్ని పగులగొట్టారు. దేవాలయంలో హుండీలను పగలగొట్టి అందులో సుమారు రూ.15 వేల నగదును ఎత్తుకెళ్లినట్టు సమాచారం.ఈ విషయమై ఆలయ నిర్వాహకులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.పోలీసులు ఆలయాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు.



మత్స్యశాఖ సంఘం శర్బనాపురం అధ్యక్షుడిగా లింగయ్య

నవతెలంగాణ-ఆలేరురూరల్

మండలంలోని శర్బనాపురం గ్రామంలో ఆదివారం మత్స్యశాఖ సంఘం అధ్యక్షుడిగా ఎదు లింగయ్య, ఉపాధ్యక్షునిగా వెంకటేశ్, కార్యదర్శిగా శ్రీశైలం, డైరెక్టర్లు కృష్ణ ,వెంకటేష్,నర్సింహులు, శ్రీను,సూర్యకిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు .ఈ సందర్భంగా అధ్యక్షున్ని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వెంకటేష్,అంజయ్య,కళ్యాణ్, నరేష్, నర్సింహులు,రాములు,సత్యనారాయణ, నర్సింహులు, దశరథ,జానకిరాములు, నర్సింహులు,కృష్ణ,సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా లెర్నింగ్ లైసెన్సులు అందజేత

నవతెలంగాణ-భువనగిరిరూరల్

భువనగిరి మండలంలోని కూనూరు గ్రామానికి చెందిన దాదాపు 30 మంది యువకులకు కాంగ్రెస్ మండలవర్కింగ్ ప్రెసిడెంట్, కూనూరు ఎంపీటీసీ పాశం శివానంద్ సొంత నిధులతో ఉచితంగా లెర్నింగ్ లైసెన్సులు అందజేశారు. .లెర్నింగ్ పొందిన వారికి డ్రైవింగ్ టెస్ట్ అనంతరం డ్రైవింగ్ లైసెన్సులు కూడా సొంతంగా అందజేస్తామన్నారు.మొన్నటి వరకు డీసీసీ అధ్యక్షులుగా కొనసాగిన కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రకటించిన ఉచిత లైసెన్స్‌మేళాలో దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు సొంత డబ్బులతో లైసెన్సు పత్రాలను దరఖాస్తుదారులకు అందజేశారు.

నర్సిరెడ్డి హత్యకు కారణమైన వారిని శిక్షించాలి

నవతెలంగాణ-వలిగొండరూరల్

కొల్లు నర్సిరెడ్డి హత్యకు కారకులైన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు.ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.కొల్లు నర్సిరెడ్డి సీపీఐలో చురుకైన కార్యకర్తగా పనిచేశారన్నారు.ఆయన మృతి సీపీఐకి తీరని లోటన్నారు.హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.



క్రీడాకారుడు భానుప్రకాష్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఇటీవల భారత దేశం తరపు నుండి బంగ్లాదేశ్ రాజధాని డాకాలో జరిగిన టార్గెట్‌బాల్ అంతర్జాతీయ క్రీడలలో ఆలేరు పట్టణానికి చెందిన క్రీడాకారుడు మెరుగు భానుప్రకాష్ విజయం సాధించి పతకం సాధించాడు. ఆదివారం ఆయన్ను పట్టణంలోని బీజేవైఎం సభ్యులు, పలువురు, క్రీడాకారుడు శాలువాతో ఘనంగా సన్మానించడంతో పాటు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జహంగీర్, సిద్ధులు,బీజేవైఎం సభ్యులు పాల్గొన్నారు.

ఆగస్టు ఒకటిన చర్చా వేదిక

నవతెలంగాణ-భువనగిరి

తెలంగాణ సాయుధ పోరాట ధీరుడు, స్వాతంత్ర్య సమర యోధుడు,భూ పోరాటాల స్ఫూర్తి ప్రదాత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు కాచం కృష్ణమూర్తి 14వ వర్ధంతి సందర్భంగా ఆగస్టు ఒకటిన తేదీ సుందరయ్య భవన్, భువనగిరిలో ఉదయం 11 గంటలకు 'వ్యవసాయ కార్మికులు – సంక్షేమం – కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిర్వహిస్తున్న చర్చా వేదికను అభ్యుదయవాదులు, ప్రజాసంఘాల నాయకులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయకార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.కృష్ణమూర్తి ఆనాడు రజాకార్లకు, దొరలకు వ్యతిరేకంగా భూమికోసం, భుక్తి కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం అనేక పోరాటాలకు నాయకత్వం వహించి ముందుండి పోరాడిన మహాయోధులన్నారు.వారి నాయకత్వంలో ఆనాడు అనేక భూమి, కూలీ, సామాజిక సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు నడిపినాయని తెలిపారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని మరిచి దాడులు, దౌర్జన్యాలు, మహిళలపై అత్యాచారాలు, ప్రజలకు ఉన్న చట్టాలను అమలు చేయకపోవడం, కూలీలకు సమగ్ర చట్టాన్ని తేవకపోవడం అమలు చేయకపోవడం లాంటివి కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.వీటన్నింటి పైన ఆగస్టు ఒకటిన చర్చించి పోరాట కార్యక్రమాన్ని రూపొందించడానికి చర్చావేదిక నిర్వహిస్తున్నామని తెలిపారు.రాజకీయాల కతీతంగా అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

హజరత్ కల్మీ హుస్సేన్ కల్మీ మూర్తుజా ఉర్సు

నవతెలంగాణ-భువనగిరి

స్థానిక పత్తి కంపెనీ వద్ద గల హజరత్ కల్మీ హుస్సేన్ కల్మీ మూర్తుజా ఉర్సు ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చదర్ సమర్పించారు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎండీ షరీఫ్,ఎండి.ఇక్బాల్‌చౌదరి, ఎండి. అజీమ్,ఎండి. అమీరుద్దీన్,ఎండి.ఖాజామ్, యూసఫ్, జావీద్,పప్పు, అంజద్, జగన్, షేక్‌మీరా,ఇర్షద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోకి విద్యార్థిసంఘాలను రానివ్వొద్దనడం అప్రజాస్వామికం

నవతెలంగాణ-తుంగతుర్తి

ప్రభుత్వ పాఠశాలలోకి విద్యార్థిసంఘాలను, మీడియాను రానివ్వొద్దని విద్యాశాఖ ఇచ్చిన నోటీసులు అప్రజాస్వామికమని తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొండ రాజు అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పెద్దబోయిన అజయ్, హుస్సేన్, చంటి, అబ్దుల్ ఉన్నారు.

రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-మునగాల

రైతు బీమా కోసం మండల రైతాంగం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బాణోత్ అనిల్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు దరఖాస్తు చేసుకు నేందుకు ఆగస్టు 5 తేది చివరి రోజని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2023 పాలసీకి సంబంధించి రైతు భీమా పథకం దరఖాస్తులను రైతు వేదికల్లో సేకరించనున్నట్టు తెలిపారు. 18-06-2023 వ తేదీ వరకు కొత్తగా పట్టాదార్ పాస్ బుక్‌లు పొందిన రైతులతో పాటు ఇంకా అంతకు ముందు పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన రైతులు కూడా వెంటనే దరఖాస్తు చేసు కోవాలని సూచించారు. ధరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్ జిరాక్స్‌లతో రైతు వేదికల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 14.08.1964-14.08.2005 మధ్య జన్మించిన వారు మాత్రమే ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. నామినీ ఆధార్ కార్డ్‌ను కూడా అందించాలని కోరారు.

రేపు నియోజకవర్గ జనరల్ బాడీ ర్యాలీని జయప్రదం చేయండి

నవతెలంగాణ-నేరేడుచర్ల

ఆగస్టు ఒకటో తారీఖున సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా హుజూర్‌నగర్ నియోజకవర్గ జనరల్ బాడీని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ పిలుపునిచ్చారు.నేరేడుచర్లలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.హుజూర్‌నగర్ నియోజకవర్గ సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం ఇక్కడ ఎమ్మెల్యే నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు.8 ఏండ్ల నుండి పేదలు ఇండ్లస్థలాల కోసం పోరాడుతుంటే ఎమ్మెల్యే స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.నియోజకవర్గంలో లింకు రోడ్లు గుంటలు పడి రవాణాకు ఇబ్బందిగా ఉంటే నేటికీ మరమ్మతులు చేయలేదని,వెంటనే ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు ఒకటిన జరిగే సదస్సును ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వాసా పల్లన్న, సయ్యద్‌హుస్సేన్, కర్ణాకర్, పావని, సత్యక్క, తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 2 నుండి 18 వరకు అమరులయాదిలో సామాజికచైతన్యయాత్ర

నవతెలంగాణ-సూర్యాపేట

ఆగస్టు 2న బొల్లగాని పుల్లయ్య 35వ వర్ధంతి నుండి 18 న సర్వాయి పాపన్న 373 వ జయంతి వరకు సామాజిక చైతన్య యాత్ర అమరుల యాదిలో పేరుతో జిల్లా వ్యాప్తితంగా నిర్వహిస్తున్నామని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎలుగురి గోవింద్, మడ్డి అంజిబాబు లు తెలిపారు. ఆదివారం స్థానిక మల్లు వెంకటనర్సింహారెడ్డి భవన్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు.అమరవీరుల త్యాగాలను నేటి సమాజానికి తెలుపుతామని పేర్కొన్నారు.కల్లుగీత వృత్తిలో ఉపాధి – ప్రత్యామ్నాయ మార్గాలు ప్రచారం చేస్తూ వేలాది మందికి సామాజిక చైతన్యం కల్పిస్తామన్నారు.సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు 20 ఏండ్ల నుండి కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.2016 లో ఖిలాషాపురం నుండి గోల్కొండ కోటకు రాష్ట్ర బస్సు యాత్ర నిర్వహించామని 2017లో పాపన్న యాదిలో పది యాత్రలు రాష్ట్రవ్యాప్తంగా జరిపామని పేర్కొన్నారు. 2018 లో పాపన్న సందేశ యాత్ర నిర్వహించి ముగింపుగా వివిధ సామాజిక సంఘాల నాయకులను ఆహ్వానించి ఉప్పల్‌లో భారీ బహిరంగ సభ జరిపామని వారు తెలిపారు. 2019 లో పాపన్న యాదిలో వెయ్యి సభలు నిర్వహించామని చెప్పారు.లాక్‌డౌన్‌లో సైతం 2020 లో లక్ష మందితో ఆన్‌లైన్‌బహిరంగసభ నిర్వహించామన్నారు.అమరుల యాదిలో పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 2 నుండి 18 వరకు 17 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా యాత్రలు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైన కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం, ఎస్ఆర్ దాట్ల, తొట్ల మల్సూర్, దేశిని చిన్నమల్లయ్య, పెరుమాండ్ల జగన్నాథం, బొల్లగాని పుల్లయ్య, వర్దెల్లి బుచ్చి రాములు, బైరు మల్లయ్య తదితర సంఘం నాయకులను స్మరించుకుంటూ ఈ యాత్రలు జరుగుతున్నాయని వివరించారు.సామాజిక సేవకులు, సంఘ సంస్కర్తలు పూలే,సావిత్రి బాయిపూలే, నారాయణగురు, పెరియార్ రామస్వామి, సాహు



మహరాజ్, అంబేద్కర్ లాంటి మహనీయుల జీవిత విశేషాలను నేటి తరానికి తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.సర్వాయి పాపన్నస్ఫూర్తితో కల్లుగీత కార్మికులను రాజకీయ పార్టీలకతీతంగా ఐక్యం చేసి హక్కుల పోరాడుతామన్నారు.ఈ సందర్భంగా సాంస్కృతిక, సేవా కార్య కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.గౌడ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.అన్నమాట ప్రకారం అమలు చేయకపోతే సెప్టెంబర్‌లో హైదరాబాదులో వేలాది మందితో ఆందోళన కార్యక్రమం చేపడతామన్నారు.ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కల్లు గీత సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అబ్బగాని భిక్షం, గుణగంటి కృష్ణ, కొండ అన్నపూర్ణ, జిల్లా సహాయ కార్యదర్శి ఉయ్యాల నగేష్, జిల్లా కమిటీ సభ్యులు సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తండ రమేష్, బట్టిపల్లి నాగమల్లయ్య, జేరిపోతుల కృష్ణ,నోముల వెంకన్న, అబ్బగానికి కాశయ్య, కారింగుల సైదమ్మ ,బెల్లంకొండ ఇస్తారి,గుండగాని శ్రీనివాస్, ఆకులరమేష్, గుణగంటి వెంకన్న,నకిరేకంటి శ్రీను, బోడసైదులు, తదితరులు పాల్గొన్నారు.

నిండుకుంటున్న జలాశయాలు

- ఆరు చెరువులు డ్యామేజ్
- పొంగిపొర్లుతున్న 29 చెరువులు

నవతెలంగాణ-భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇటీవల కురిసిన ఆకాలవర్షాలతో వచ్చిన నీటితో, ప్రవహించిన వరదనీరుతో చెరువులు కుంటలు నిండుకుండలా తయారయ్యాయి.ఆరు చెరువులు కట్టలు తెగిపోయాయి.సుమారు 300 టన్నుల చేపలు కొట్టుకపోయాయి.ఆత్మకూరు మండలంలో 26 ఎకరాల వరి పంట నీట మునిగింది.పలు ప్రాంతాలలో వాణిజ్యపంటలు ముఖ్యంగా కూరగాయలు కుళ్ళిపోయాయి.తెల్ల బంగారమైన పత్తి పంటకు మాత్రం లాభం చేకూరిందని రైతులు పేర్కొంటున్నారు. బస్వాపురం కాళేశ్వరం ప్రాజెక్టులోకి నీరొచ్చి చేరింది.సంబంధిత కాలువలో నీరు ప్రవహిస్తున్నది.జిల్లాలో 100 ఎకరాల మీద విస్తీర్ణం ఉన్న చెరువులు 100 ఎకరాలలోపు విస్తీర్ణం ఉన్న చెరువులు నియోజకవర్గాలుగా ఇలా ఉన్నాయి.భువనగిరి నియోజకవర్గంలో 54, 234 ఆలేరు 124, 315, నకిరేకల్ 12,78 తుంగతుర్తి 11,24 మునుగోడు 15 354 మొత్తం జిల్లాలో 1080చెరువులు ఉన్నాయి. ఇందులో 25 శాతం పైగా నిండినవి 15 శాతం, 50 శాతం పైగా నిండినవి 26 శాతం, 75 శాతం పైగా నిండినవి 15 శాతం, 100 పైగా నిండినై 13 శాతం సర్‌ప్లస్ గా ఉన్నవి 29 శాతం చెరువులలోకి నీరు వచ్చి చేరింది.

పూర్తిస్థాయి పరిశీలనలో అధికారులు

జిల్లావ్యాప్తంగా వర్షం కారణంగా జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేయడానికి రెవెన్యూ, వ్యవసాయ, నీటిపారుదల, మత్స్య, శాఖలు వేర్వేరుగా క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్తున్నాయి. జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారు.

ప్రజలను ఆదుకోవాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్

వర్షం కారణంగా నష్టపోయిన ప్రజలను రైతులను మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించాలి.పట్టణాల్లో గ్రామాల్లో మౌలిక వసతులు కోల్పోయిన ప్రజలకు రేషన్‌తో పాటు కుటుంబానికి రూ.10 వేల చొప్పున అందించాలి.కట్టలు తెగిపోయిన చెరువులకు యుద్ధప్రతిపాదికన నిర్మాణపనులు చేపట్టాలి.రైతులకు విత్తనాలను, మత్స్యకారులకు చేప పిల్లలను ఉచితంగా అందించాలి.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-సూర్యాపేట

ప్రభుత్వ వివిధ విభాగాలలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసే విధంగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా సంఘం నాయకులు ఎం.రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆదేశాలు, కార్యక్రమాలు, పనులను అమలు సేస్తూ ప్రజలకు సేవలందించడంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఆర్థిక భద్రత,ఉద్యోగ భద్రత వస్తుందని ఉద్యోగులు ఆశ పడ్డారని,వారి ఆశలను నేర వేర్చటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

నవతెలంగాణ-నాగారం

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కల్లెట్లపల్లి ఉప్పలయ్య అన్నారు. ఆదివారం ఫణిగిరి గ్రామంలో తన నివాసంలో పస్తాల గ్రామానికి చెందిన ఆకుల కిరణ్మయి అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం తుంగతుర్తి నియోజకవర్గ శాసనసభ్యులు గాదరి కిషోర్‌కుమార్ సహకారంతో 18 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మల్యాల అశోక్, తీగుళ్ల యాదగిరి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషి

నవతెలంగాణ-తుంగతుర్తి

మైనార్టీ సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని బీఆర్ఎస్ మండల మైనార్టీ కోఆప్షన్ సభ్యులు ఎండి పజ్జీఉద్దీన్ అన్నారు.ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మైనార్టీల స్వయం ఉపాధి కోసం లక్ష ఆర్థికసాయం జీవో విడుదల చేయడంతో మైనార్టీ కుటుంబ సభ్యుల తరపున కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీల సంక్షేమం కోసం యాట వేల కోట్ల రూపాయలు బడ్జెట్ ఖర్చు చేయడంతో పాటు మహిళ ఆర్థిక ప్రగతి కొరకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నారన్నారు .తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు మైనార్టీల కోసం ఏర్పాటు చేస్తుందని, షాది ముబారక్, మైనార్టీ గురుకులాలు ఏర్పాటు లాంటి ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని, అందుకు ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. వచ్చే ఎన్నికల్లో తుంగతుర్తి ఎమ్మెల్యేగా గాదరి కిషోర్‌కుమార్‌ను నియోజకవర్గ మైనార్టీలు గెలిపించుకోవాలని కోరారు.

జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

గ్రామ పంచాయతీల కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామల నవీన్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శీను అన్నారు. ఆదివారం గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె చేస్తున్న శిబిరాన్ని సందర్శించి వారికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడారు. జీపీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ నాయకులు పల్లపు దాసు, రాజు, దగ్గిరపతయ్య, మాశెట్టి అంజయ్య, ఇందిరమ్మ, చింతమల్ల అంజయ్య, ఇందిరమ్మ, వెంకటరెడ్డి, నాగరాజు, కొండలు, కనకరత్నం, నాగేశ్వరరావు, శ్రావణి అస్సామీయా తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో..



గరిడేపల్లిలో...

గరిడేపల్లి:గ్రామపంచాయతీ కార్మికులు సమస్యలను పరిష్కరించాలని సీఐటీయు జిల్లా నాయకులు షేక్ యాకుబ్, సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. సమ్మె 25 వ రోజుకు చేరుకున్న సందర్భంగా ఆదివారం వంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గోపగాని సత్యనారాయణ, నర్సిరెడ్డి, శ్రీను, వెంకన్న, మాతంగి ముత్యయ్య, గోపయ్య, చారీ, నవీన్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

తండాలలో తీజ్ పండుగ సందడి

- లంబాడీల ఆరాధ్య దేవత సీతలా భవానికి ప్రత్యేక పూజలు
- భక్తి శ్రద్ధలతో సంప్రదాయ పద్ధతులతో వేడుకలు

నవతెలంగాణ-పెద్దవూర

పెద్దవూర మండలంలో గిరిజన తండాలు తీజ్ పండుగతో సందడి వాతావరణం నెలకొంది. మండలంలోని జయరాం తండా, కుంకుడు చెట్టు తండా, భాసోనిబావి తండా, కోమటి కుంట తండా, గేమ్యా నాయక్ తండా,నీమానాయక్ తండా, రామన్న గూడెం తండా, పొట్టేవాని తండా,లో తీజ్ పండుగను సంప్రదాయం రీతులతో జరుపుకుంటారు. ప్రజలందరు చల్లగా వుండాలని, వర్షాలు బాగా కురిసి సమృద్ధిగా పంటలు పండాలని లంబాడీ యువతులకు మంచి భర్తలు లభించాలని, గొడ్డు, గోద, చల్లగా వుండాలని మహిళలు సంప్రదాయ పద్ధతులతో నృత్యాలు చేస్తూ అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.గిరిజన తండాలలో అవివహితలు తీజ్ పండుగతొమ్మిది రోజుల పాటు జరుపు కుంటారు.ప్రతి యేటా జులై చివరి వారంతో తీజ్ పండుగలు తండాలలో ప్రారంభం అవుతాయి. తీజ్ పండుగ చివరి రోజు డప్పుల మోతలు, కేరింతలు, ఆటపాటలు, నృత్యాలు, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధాలు, బావామరదళ్ల



అల్లరి చేష్టలు ఉంటాయి. తొమ్మిది రోజుల పాటు వేడుకలు జరుగుతాయి. ఈ పండుగ 'బతుకమ్మ'ను పోలి ఉంటుంది. గోధుమ మొక్కలను ఎనిమిది రోజులపాటు పూజించి తొమ్మిదవ రోజు నిమజ్జనం చేస్తారు. ఉత్సవాలను పెళ్లి కాని ఆడపిల్లలే నిర్వహిస్తారు. వీరికి తండా పెద్దలు, సోదరులు సహకరిస్తారు. వర్షాకాలం ఎర్రని ఆరుద్ర పురుగు వచ్చే సమయానికి పండుగ జరుపుతారు. గోధుమ మొలకలను 'తీజ్'గా పిలుస్తారు. బతుకమ్మను పూలతో అలంకరించినట్లే గోధుమలను నానబెట్టి తీజ్ మొలకలను పూజించడం ఆనవాయితీగా వస్తుంది.

తొమ్మిది రోజుల పాటు

తండా పెద్దమనుషుల అనుమతి తీసుకొని ఆడపిల్లలు పండుగకు సన్నాహాలు చేసుకుంటారు. ఇంటింటికీ వెళ్లి పెద్దల ఆశీర్వాదం తీసుకుంటారు. విరాళాలు సేకరిస్తారు. అంగడికి వెళ్లి గోధుమలు, శనగలు, ఇతర సామగ్రి తెచ్చుకుంటారు. గోధుమలను నానబెట్టడానికి దుస్సేరు తీగలతో బుట్టలను అల్లుతారు. పుట్ట మట్టిని తెచ్చి అందులో మేక ఎరువు కలుపుతారు. మొదట తండా నాయకుడి చేత ఎరువు కలిపి మట్టిని పోయించి గోధుమలను చల్లిస్తారు. తండాలో పాడి పంటలు పచ్చగా ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్, సీత్లా మేరమా మాతతో పాటు, తిరుపతి బాలాజీ, హాథీరాం బాలాజీ, వేములవాడ రాజన్న, తుల్జా భవానీని కొలుస్తారు. తండాలను ఒక్కొక్క దేవత ఒక్కొక్క రకంగా కాపాడుతుందని వీరంతా నమ్ముతారు. తొమ్మిది రోజులు బుట్టలో నీళ్లు పోస్తారు. గోధుమలను నానబెట్టాక రేగు ముళ్లు గుచ్చుతారు. ఈ సమయంలో వరసకు బావ అయ్యేవారు వాటిని కదిలిస్తారు. గోధుమలు మంచిగా మొలకెత్తితే పంటలు బాగా పండుతాయని తండా పెద్దలు భావిస్తారు. ఏడో రోజు 'ఢమోళి' జరుపుతారు. చుర్మోను (రొట్టెలను బెల్లంతో కలిపి చేసే ముద్ద) మేరామా భవానికి సమర్పిస్తారు. దీన్నే 'అకాడో' అంటారు. మేక మాంసాన్ని ప్రతి ఇంటికి పంపిస్తారు. తీజ్ వద్ద ఆటపాటలతో ఆనందంగా గడుపుతారు.

ఎనిమిదో రోజున మట్టితో చేసిన ఆరాధ్య దేవతల ప్రతిరూపాలను పూజించి వాటికి పెళ్లి చేస్తారు. తమను డోక్రీలుగా ఊహించుకొని, పెళ్లి అయితే పుట్టిల్లు వదిలివెళ్లాల్సి వస్తుందని ఏడుస్తారు. సోదరులు ఓదార్చుతారు. తొమ్మిదో రోజున తీజ్ నిమర్జనానికి బంధుమిత్రులను ఆహ్వానించి వేడుకలు జరుపుతారు. తండా నాయక్ బుట్టలను ఆడపిల్లలకు అందిస్తారు. అన్నదమ్ములు బుట్టనెత్తుకున్న ఆడపిల్లల ఆశీర్వాదం తీసుకుంటారు. (ఇది రాఖీ పండుగను పోలి ఉంటుంది). తరువాత నిమజ్జనానికి బయలుదేరుతారు. ఇది అద్భుత సన్నివేశంగా కనువిందు చేస్తుంది.

కఠిననియమాలు

ఈ తొమ్మిది రోజుల అమ్మాయిలకు కఠిన నియమాలు పాటిస్తారు.ఉప్పు, కారం లేని భోజనం తినాలి.భక్తితో దేవతలను పూజించాలి. తండా నుంచి బయటకు వెళ్లకూడదు. మాంసం నిషేధం. బావి నుంచి నీటిని తెచ్చే బిందెను నేలపై పెట్టకుండా నేరుగా పందిరిపై నీరు పోయాల్సిందే. ఇంత గొప్పగా జరుపుకునే సీత్లా భవాని, తీజ్‌ను ప్రభుత్వం అధికారిక పండుగలుగా ప్రకటించాలని లంబాడీలు కోరుతున్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ -పెద్దవూర



మండలంలోని పేదలకు, వికలాంగులకు బడుగు బలహీన వర్గాల వారికి బుసిరెడ్డి ఫౌండేషన్ ఛైర్మెన్ పాండు రంగారెడ్డి ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని గర్నెకుంట, వెలమగూడెం, బుసిరెడ్డిపల్లి, పెద్దగూడెం, చిన్నగూడెం, శిరసనగండ్ల, తమ్మడపల్లి, కొత్తలూరు, కుంకుడు చెట్టు తండా, బోనూతల, బెట్టెలతండ, పూరబావి తండా, నీమానాయక్ తండా, చలకుర్తి, పొట్టివాని తండా, నాయనవాని కుంట, నాయనవాని కుంట తండా, తుంగతుర్తి, ముసలమ్మ చెట్టు, లింగంపల్లి, తెప్పలమడుగు గ్రామాలలో 55మంది నిరుపేద కుటుంబాలకు రూ. 5వేలు చొప్పున 2,55,000 లు ఆర్థిక సహాయం గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్ళి అందజేశారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు, గిరిజనులకు, వికలాంగులకు, అనాధలకు, వృద్దులకు ఆసరాగా ఉండేందుకు ఈ సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, సర్పంచులు నడ్డి లింగయ్య, బాలవర్ధి రాజు, రావుల శ్రీను, నరాల కొండయ్య, మల్లారెడ్డి, రమావత్ చందూనాయక్, శంకర్, వెంకటరెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్వర్లు, నెల్లికల్ సర్పంచ్ పమ్మి జనార్ధన్‌రెడ్డి, ఉప సర్పంచ్‌లు ప్రదీప్‌రెడ్డి, నాగేశ్వరరావు, నాగరాజు, సక్రు నాయక్, విక్రమ్‌రెడ్డి, జలీలపాషా, శంకర్, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం వేడుకల్లో పాల్గొన్న బాలునాయక్



నవతెలంగాణ-కొండమల్లేపల్లి

హిందూ ముస్లిం కులమతాలకు అతీతంగా జరుపుకునే మొహరం వేడుకల్లో దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శనివారం రాత్రి గుమ్మడవెల్లి గ్రామంలో మొహరం వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలంతా హిందూ ముస్లిం కులమత బేధాలు లేకుండా ప్రేమానురాగాలతో మొహరం వేడుకలను జరుపుకోవాలని అన్నారు. వీరి వెంట వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వి .వేమన్ రెడ్డి, సిరాజ్ ఖాన్ , నాయిని మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీ బొడ్డుపల్లి సైదులు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఆర్ జగన్ నాయక్, రాజు నాయక్, బచ్చనబోయిన అశోక్, యాదయ్య శ్రీను, అందుగుల ముత్యాలు, ముజావర్లు బండి మైబు, జాంగిర్, చాంద్ పాషా, లాలయ్య, రామకృష్ణ, సేవా ,కదీర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నాంపల్లి



నాంపల్లి మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకులు పెద్దిరెడ్డి సంజీవరెడ్డి (రాజు) నాయనమ్మ పెద్దిరెడ్డి రాములమ్మ ఇటీవల మృతి చెందారు. ఆదివారం మునుగోడు మాజీ శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంజీవరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి రాములమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు ఏరెడ్ల రఘుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు పూల వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మెన్ గట్టుపల్లి నర్సిరెడ్డి, కత్తి రవీందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, దుర్గయ్య హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

నల్లగొండ పట్టణంలోని గాంధీ నగర్‌లో నివాసం ఉంటున్న గడ్డం శివకుమార్ ఆర్థిక ఇబ్బందులతో మూడు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నారు. ఆదివారం విషయం తెలుసుకున్న గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మెన్ గుత్తా అమిత్‌రెడ్డి స్పందించి బాధిత కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపి ట్రస్ట్ ద్వారా రూ.15వేల ఆర్థిక సాయం బీఆర్ఎస్ నాయకుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు అయితగాని స్వామిగౌడ్, నాగులవంచ వెంకటేశ్వరరావు, కంచర కుంట్ల గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంగ్లానాయక్ నివాళులు

నవతెలంగాణ-తిరుమలగిరిసాగర్

మండలంలోని నాయకుని తండకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త మేరావత్ మంగ్లా నాయక్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు కుందూరు జయవీర్, మండల ఎంపీపీ ఆంగోత్ భగవాన్ నాయక్ ఆదివారం ఆయన భౌతిక దేహాన్ని పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబానికి ఓదార్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా మండల ఎంపీపీ ఆంగోత్ భగవాన్ నాయక్ వారి కుటుంబాన్ని రూ.5వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజక వర్గ ఉపాధ్యక్షులు మేరావత్ మునినాయక్, బిచ్యాలు, మేరావత్ కొండానాయక్, జరుపుల శౌరి నాయక్, సపావత్ హచ్చు నాయక్, బూడిద కొండల్, బిక్కు నాయక్, లాలు నాయక్, నాగేందర్ నాయక్, బుజ్జి రామారావు, రంగసాయి, సైదా నాయక్,బాలు నాయక్, స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మనసున్న వ్యక్తి మేకల వెంకట్

నవతెలంగాణ-త్రిపురారం

గత కొన్ని నెలలుగా త్రిపురారం మండల పరిధిలోని దుగ్గేపల్లి గ్రామపంచాయతీలో మేకలు శ్యాంసుందర్ జ్ఞాపకార్థం కుమారుడు మేకల వెంకట్ తన సొంత డబ్బుతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు గ్రామ ప్రజలు తెలిపారు. ఏ సమయంలో అయినా ప్రజలకు అందుబాటులో ఉండి మా సమస్యల పట్ల పరిష్కారం చూపుతున్న మనసున్న వ్యక్తి మేకల వెంకట్ అని గ్రామ ప్రజలు అంటున్నారు. ఆదివారం కూడా కాడబోయిన ఉపేంద్ర యాదవ్ విద్య నిమిత్తం ఐదువేల రూపాయలను, ఏడు గురు పేదవారికి బియ్యం పంపిణీ చేశారు. గ్రామంలో ఎవరికైనా ఏదైనా సహాయం కావాలంటే సంప్రదించాలని మేకలు వెంకట్ తెలిపారు.



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఎంపికైన సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-నాగార్జునసాగర్

తెలంగాణ అథ్లెటిక్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్స్‌లో రాష్ట్రస్థాయికి నాగార్జునసాగర్ సెయింట్ జోసెఫ్ హై స్కూల్ క్రీడాకారులు 400 మీటర్స్, జవాలెన్ త్రో విభాగంలో పీ.కీర్తన మొదటి స్థానంలో, 100మీటర్స్ విభాగంలో ఎండీ.సభానూర్ మొదటి స్థానంలో ఎంపికయ్యారు. వీరు ఆగస్టు7, 8 తేదీలలో హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పాల్గొననున్నారు. వీరిని పాఠశాల హెచ్ఎం సిస్టర్ అన్నమ్మ, సిస్టర్ క్లారా, పిఈటి కిరణ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి

నవతెలంగాణ-నాంపల్లి

నాంపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలలో పనిచేస్తున్న అవసరానికంటే ఎక్కువగా ఉన్న మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని పీఆర్‌టీయూ మండల శాఖ డిమాండ్ చేస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు. నాంపల్లి కేంద్ర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఇద్దరు ఉపాధ్యాయులకు మాత్రమే సరిపడా ఉన్నప్పటికీ అక్కడ ముగ్గురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నాంపల్లిలో మిగులుగా ఉన్న భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఒక సంఘానికి ప్రధాన బాధ్యులుగా వ్యవహరిస్తూ సంఘాన్ని అడ్డుపెట్టుకొని వేరే పాఠశాలకు వెళ్లకుండా ఎంఈఓ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులను బెదిరిస్తూ వేరొక సంఘం మీద నిందలు మోపుతూ అదే పాఠశాలలో తిష్ట వేసి కూర్చున్నారని ఆరోపించారు. కలెక్టర్, డీఈవో ఉత్తర్వులు ఉన్నప్పటికీ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు మిగులు ఉపాధ్యాయులను రిలీవ్ చేయనీయకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. మండల విద్యా వ్యవస్థను, మండల ఉపాధ్యాయులను కించపరిచే విధంగా అధికారుల వివరణ కోరకుండా తమ ఇష్టానుసారంగా పత్రికా ప్రకటనలు పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని పి ఆర్ టి యు మండల అధ్యక్ష కార్యదర్శులు ఎన్. రఘు వర్ధన్ రెడ్డి, బాలాజీ, రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు ఎన్ యుగంధర్ హెచ్చరించారు.